# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

RNI-APTEL/2012/46499

GST No:-37ACDFM5465G1Z1

సంపుటి : 14 సంచిక : 342 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ ఎడిటర్ : మహేష్ యాదవ్ 1-12-2025 పేజీలు : 12 వెల రూ.3/




## భోగాపురం విమానాశ్రయం సిద్ధం..



2

వచ్చే నెలలో ఎగరనున్న తొలి విమానం!
టెస్ట్ ఫ్లైట్‌కు సిద్ధమవుతున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం
డిసెంబర్ చివరిలో లేదా జనవరిలో తొలి విమానం ఎగిరే అవకాశం
ఇప్పటికే 92 శాతానికి పైగా పూర్తయిన నిర్మాణ పనులు
కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు పర్యవేక్షణతో పనుల్లో అనూహ్య వేగం
దేశంలోనే అతి పొడవైన రన్‌వేలలో ఒకటిగా 3.8 కి.మీ. రన్‌వే నిర్మాణం

# ప్రజల్లోనే ఉండండి,..
# ప్రభుత్వ మంచిని వివరించండి

టీడీపీ శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం
టీడీపీ శ్రేణులతో ముఖ్యమంత్రి చంద్రబాబు టెలి కాన్ఫరెన్స్
ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపు
దేశంలో ఎక్కడా లేని విధంగా పెన్షన్లు అందిస్తున్నామని స్పష్టీకరణ
గత పాలకుల విధ్వంసం, నిధుల మళ్లింపుపై విస్తృత చర్చ జరగాలన్న సీఎం
పనిచేసిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవులతో సముచిత గౌరవం ఇస్తామని హామీ



అమరావతి

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, చేస్తున్న మంచి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, వారి మద్దతు కూడగట్టాలని తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వ విధానం 'పొలిటికల్ గవర్నెన్స్' అని, సంక్షేమ ఫలాలు అందించడమే కాకుండా నేతలు, కార్యకర్తలు నిరంతరం ప్రజలతో మమేకమై ఉండాలని ఆయన స్పష్టం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్య నేతల నుంచి బూత్ స్థాయి కార్యకర్తల వరకు అందరితో ఆయన ఆదివారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమాలపై డిసెంబర్ నెల క్యాలెండర్‌ను విడుదల చేశారు. పెన్షన్ల పంపిణీ కార్యక్రమంపై చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. "ప్రతినెలా 1వ తేదీన ఎలాంటి ఆటంకం లేకుండా పెన్షన్లు అందిస్తున్నాం. కేటగిరీల వారీగా రూ.4 వేల నుంచి రూ.15 వేల వరకు అందిస్తున్న ఏకైక రాష్ట్రం మనదే. వృద్ధులకు ఏటా రూ.48 వేలు, డయాలసిస్ రోగులకు రూ.1.20 లక్షలు, పూర్తిగా మంచానికే

2

## గల్లీలో కుస్తీ.. ఢిల్లీలో దోస్తీ

- రేవంత్ సర్కారుపై హరీశ్ ఫైర్
కాంగ్రెస్, బీజేపీలు తోడు -
దొంగలంటూ హరీశ్ రావు విమర్శ
- గల్లీలో కుస్తీ, ఢిల్లీలో దోస్తీ అంటూ ఎద్దేవా
- స్థానిక ఎన్నికల్లో ఆ రెండు పార్టీలను నిలదీయాలని పిలుపు



వివరాలు 2

తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం...

## 11 మంది దుర్మరణం

- శివగంగ జిల్లా తిరుపత్తూర్ సమీపంలో ఘటన
- కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో పెరగనున్న మృతుల సంఖ్య
- వారం రోజుల వ్యవధిలోనే ఇది రెండో పెద్ద బస్సు ప్రమాదం

2





## 'ఐబొమ్మ' వెబ్‌సైట్‌లో నేను కూడా సినిమాలు చూశాను

2

- సీపీఐ నారాయణ సంచలన వ్యాఖ్యలు
- 'ఐబొమ్మ' రవిని కాదు, సినిమా మాఫియాను ఉరితీయాలన్న నారాయణ
- వందల రూపాయల టికెట్ ధరల వల్లే ఇలాంటివి పుట్టుకొస్తున్నాయని వెల్లడి
- వ్యవస్థలోని లోపాలే రవి లాంటి వారిని తయారు చేస్తున్నాయని వ్యాఖ్యలు
- ఒక హిడ్మాను చంపితే వెయ్యి మంది పుడతారన్న నారాయణ


వర్షంలోనూ తిరుమలకు

## పోటెత్తిన భక్తులు..

- సర్వదర్శనానికి 15 గంటల సమయం
- వారాంతం కావడంతో తిరుమలకు పోటెత్తిన భక్తులు
- 14 కంపార్ట్‌మెంట్లలో దర్శనం కోసం వేచి ఉన్న భక్తజనం
- దిత్వా తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలను లెక్కచేయని భక్తులు
- శనివారం హుండీ ఆదాయం రూ.3.73 కోట్లు

2





## దిత్వా తుపాను ఎఫెక్ట్

- రేపు నెల్లూరు, అన్నమయ్య జిల్లాల్లో స్కూళ్లకు సెలవు
- దిత్వా తుపాను కారణంగా ఏపీలో భారీ వర్షాల హెచ్చరిక
- నెల్లూరు, అన్నమయ్య జిల్లాల్లో అప్రమత్తమైన అధికారులు
- విద్యార్థుల భద్రత దృష్ట్యా అధికారుల కీలక నిర్ణయం
- గంటకు 80 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం
- అప్రమత్తమైన విపత్తు నిర్వహణ, సహాయక బృందాలు

నెల్లూరు

బంగాళాఖాతంలో ఏర్పడిన 'దిత్వా' తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ ప్రాంత జిల్లాలు అప్రమత్తమయ్యాయి. భారీ వర్షాలు, బలమైన గాలులు వీచే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో, ముందుజాగ్రత్త చర్యగా నెల్లూరు, అన్నమయ్య జిల్లాల్లోని అన్ని

మిగతా 2

# దిత్వా తుపాను ఎఫెక్ట్

విద్యాసంస్థలకు సోమవారం (డిసెంబర్ 1) సెలవు ప్రకటిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.నెల్లూరు జిల్లా కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు సెలవుపై ఓ ప్రకటన విడుదల చేశారు. తుపాను కారణంగా జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలలకు సెలవు ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల భద్రతే తమకు ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు.అదేవిధంగా, అన్నమయ్య జిల్లాలోనూ విద్యాశాఖ అధికారులు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. భారీ వర్షాల నేపథ్యంలో విద్యార్థులు ఇళ్ల వద్దే సురక్షితంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా పిల్లలను చెరువులు, కాలువలు, నదీ పరివాహక ప్రాంతాల వైపు వెళ్లనివ్వొద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.విశాఖ వాతావరణ కేంద్రం అంచనాల ప్రకారం, దిత్వా తుపాను ప్రభావంతో రాయలసీమలో 10 నుంచి 15 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. గంటకు 60 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (ఎస్డీఎంఏ), ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, అధికారిక ప్రకటనలను గమనించాలని అధికారులు సూచించారు.

## 'ఐబొమ్మ' వెబ్‌సైట్‌లో నేను కూడా సినిమాలు చూశాను

సీపీఐ అగ్రనేత కె.నారాయణ 'ఐబొమ్మ' వెబ్‌సైట్ వ్యవహారంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఐబొమ్మ రవిని శిక్షించడం కంటే అసలైన సినిమా మాఫియాను ఉరితీయాలని, అప్పుడే సమాజానికి మేలు జరుగుతుందని అన్నారు. తాను కూడా ఐబొమ్మలో ఉచితంగా సినిమాలు చూశానని ఈ సందర్భంగా నారాయణ వెల్లడించారు. తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.టికెట్ ధరలను రూ.600-700కు పెంచితే సామాన్యులు సినిమాలు ఎలా చూస్తారని ఆయన ప్రశ్నించారు. "కోట్లు ఖర్చుపెట్టి, టికెట్ ధరల కోసం అడుక్కుంటారు. సామాన్య ప్రజలను దోచుకోవడానికి ప్రభుత్వం సాయం చేస్తుందా? కోట్లాది రూపాయలు దోచుకుంటున్న వారిని ఐబొమ్మ రవి దెబ్బకొట్టారు" అని నారాయణ వ్యాఖ్యానించారు. ఒకరిని జైల్లో వేయడం వల్ల ప్రయోజనం లేదని, వ్యవస్థలోని లోపాలను సరిదిద్దాలని సూచించారు.వ్యవస్థలోని లోపాలను సరిచేయనంత కాలం ఇలాంటి వ్యక్తులు పుట్టుకొస్తూనే ఉంటారని నారాయణ హెచ్చరించారు. "ఒక ఐబొమ్మ రవిని జైలులో వేస్తే మరో వంద మంది వస్తారు. అదే విధంగా, మావోయిస్టు నేత హిడ్మాను చంపడం ద్వారా వెయ్యి మంది హిడ్మాలు పుడతారు" అని అన్నారు. వ్యవస్థాగత వైఫల్యాల వల్లే రవి లాంటి వారు తప్పుడు మార్గంలోకి వెళుతున్నారని ఆయన అభిప్రాయపడ్డారు.వ్యక్తులను శిక్షించడం సమస్యకు పరిష్కారం కాదని, అసలు సమస్య వ్యవస్థలోనే ఉందని నారాయణ స్పష్టం చేశారు. ఈ వ్యవస్థే ఐబొమ్మ రవి లాంటి వ్యక్తులను సృష్టిస్తోందని, లోపాలను సరిదిద్దకపోతే భవిష్యత్తులోనూ ఇలాంటి వారు వస్తూనే ఉంటారని ఆయన పేర్కొన్నారు.

## వర్షంలోనూ తిరుమలకు పోటెత్తిన భక్తులు..

**తిరుమల**

శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. వారాంతం కావడంతో కొండపై భక్తుల రద్దీ కొనసాగుతోంది. దిత్వా తుపాను ప్రభావంతో తిరుమలలో వర్షాలు కురుస్తున్నా, చలిని సైతం లెక్కచేయకుండా భక్తులు స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. శ్రీవారి సర్వదర్శనం కోసం భక్తులు 14 కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్నారు. టోకెన్లు లేని భక్తులకు స్వామివారిని దర్శించుకునేందుకు దాదాపు 15 గంటల సమయం పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు.నిన్న ఒక్కరోజే 79,791 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ.3.73 కోట్లుగా నమోదైందని టీటీడీ వెల్లడించింది. తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలు, చల్లని వాతావరణం ఉన్నప్పటికీ భక్తుల విశ్వాసం ముందు ఇవేవీ అడ్డంకిగా నిలవలేదు. గోవింద నామస్మరణతో క్యూలైన్లలో ఓపికగా నిరీక్షిస్తూ భక్తులు తమ భక్తిని చాటుకుంటున్నారు.భక్తుల రద్దీకి అనుగుణంగా టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్న భక్తులకు తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పిస్తూ ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు.

## తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం
## 11 మంది దుర్మరణం

**తమిళనాడు**

ఆదివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శివగంగ జిల్లాలోని తిరుపత్తూర్ సమీపంలో రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్నాయి. ఈ దుర్ఘటనలో ఒక చిన్నారితో సహా 11 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.వివరాల్లోకి వెళితే, ఒక బస్సు తిరుప్పూర్ నుంచి కారైకుడి వస్తుండగా... మరో బస్సు కారైకుడి నుంచి దిండిగల్‌కు ప్రయాణిస్తోంది. తిరుపత్తూర్ వద్దకు రాగానే ఈ రెండు బస్సులు ఢీకొన్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సహాయక చర్యలు చేపట్టి, క్షతగాత్రులను శివగంగ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.తమిళనాడులో వారం రోజుల వ్యవధిలోనే ఇలాంటి ఘోర ప్రమాదం జరగడం ఇది రెండోసారి కావడం గమనార్హం. నవంబర్ 24న తెన్కాశి జిల్లాలో రెండు ప్రైవేట్ బస్సులు ఢీకొన్న ఘటనలో ఐదుగురు మహిళలు సహా ఆరుగురు మరణించగా, 56 మంది గాయపడ్డారు. ఆ ప్రమాదానికి డ్రైవర్ అతివేగమే కారణమని పోలీసులు నిర్ధారించారు. ఆ ఘటనలో మృతుల కుటుంబాలకు సీఎం ఎంకే స్టాలిన్ రూ. 3 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు.

# గల్లీలో కుస్తీ.. ఢిల్లీలో దోస్తీ

**హైదరాబాద్**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు కాంగ్రెస్, బీజేపీలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆ రెండు పార్టీలూ తోడు దొంగలని, వారి మధ్య 'గల్లీలో కుస్తీ.. ఢిల్లీలో దోస్తీ' నడుస్తోందని ఆయన ఆరోపించారు. కల్వకుర్తికి చెందిన పలువురు బీజేపీ నేతలు, కార్యకర్తలు హైదరాబాద్?లో ఆయన నివాసంలో బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా హరీశ్ రావు ఈ వ్యాఖ్యలు చేశారు.రాష్ట్ర ప్రయోజనాలను, హక్కులను కాపాడటంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హరీశ్ రావు మండిపడ్డారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రజలకు బాకీ పడిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను 'మా బాకీ పైసలు ఎప్పుడు ఇస్తారు?' అని నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు అన్యాయం చేస్తోందని హరీశ్ రావు ఆరోపించారు. రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నప్పటికీ, తెలంగాణకు ఒక్క మెడికల్ కాలేజీ కూడా తేలేకపోయారని విమర్శించారు. పక్క రాష్ట్రాలకు కేంద్రం వేల కోట్లు కేటాయిస్తుంటే, తెలంగాణకు మాత్రం మొండిచెయ్యి చూపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో కళకళలాడిన హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాలు రేవంత్ రెడ్డి అనాలోచిత నిర్ణయాల వల్ల వెలవెలబోతున్నాయని, రియల్ ఎస్టేట్ రంగాన్ని కుదేలు చేశారని దుయ్యబట్టారు.గ్రామాల్లోకి వచ్చే కాంగ్రెస్, బీజేపీ నాయకులను ప్రజలు నిలదీయాలని ఆయన కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుందని హరీశ్ రావు ధీమా వ్యక్తం చేశారు.

## కొండగట్టులో భారీ అగ్నిప్రమాదం..
## కోట్లలో ఆస్తి నష్టం

**జగిత్యాల**

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టులో శనివారం రాత్రి ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో దాదాపు 32 బొమ్మల దుకాణాలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. వ్యాపారులకు కోట్లాది రూపాయల నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.గత రాత్రి 11 గంటల సమయంలో కొండగట్టు ఘాట్ రోడ్డులోని అభయ హనుమాన్ విగ్రహం నుంచి ప్రధాన రహదారి వరకు ఉన్న బొమ్మల దుకాణాల్లో మంటలు చెలరేగాయి. సమీపంలో జరగనున్న సమ్మక్క సారలమ్మ జాతరను దృష్టిలో ఉంచుకుని వ్యాపారులు భారీ ఎత్తున బొమ్మలను కొనుగోలు చేసి దుకాణాల్లో నిల్వ ఉంచారు. ఒక్కో దుకాణంలో రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల విలువైన సామగ్రి ఉన్నట్లు తెలుస్తోంది.ప్రమాద సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకునేసరికి దుకాణాలు పూర్తిగా కాలిపోయాయి. తమ కళ్లెదుటే సర్వస్వం కాలిపోవడంతో వ్యాపారులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వారి రోదనలతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.మల్యాల, ధర్మపురి సీఐలు రవి, రాంనర్సింహారెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టులో శనివారం రాత్రి ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో దాదాపు 32 బొమ్మల దుకాణాలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. వ్యాపారులకు కోట్లాది రూపాయల నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.గత రాత్రి 11 గంటల సమయంలో కొండగట్టు ఘాట్ రోడ్డులోని అభయ హనుమాన్ విగ్రహం నుంచి ప్రధాన రహదారి వరకు ఉన్న బొమ్మల దుకాణాల్లో మంటలు చెలరేగాయి. సమీపంలో జరగనున్న సమ్మక్క సారలమ్మ జాతరను దృష్టిలో ఉంచుకుని వ్యాపారులు భారీ ఎత్తున బొమ్మలను కొనుగోలు చేసి దుకాణాల్లో నిల్వ ఉంచారు. ఒక్కో దుకాణంలో రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల విలువైన సామగ్రి ఉన్నట్లు తెలుస్తోంది.ప్రమాద సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకునేసరికి దుకాణాలు పూర్తిగా కాలిపోయాయి. తమ కళ్లెదుటే సర్వస్వం కాలిపోవడంతో వ్యాపారులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వారి రోదనలతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.మల్యాల, ధర్మపురి సీఐలు రవి, రాంనర్సింహారెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజల్లోనే ఉండండి, ప్రభుత్వ మంచిని వివరించండి

మొదటిపేజీ తరువాయి

పరిమితమైన వారికి రూ.1.80 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందుతోంది. ఇప్పటివరకు కేవలం పెన్షన్ల కోసమే రూ.50,763 కోట్లు ఖర్చు చేశాం. ఇది దేశంలోనే అతిపెద్ద నగదు బదిలీ (డీబీటీ) కార్యక్రమం. గత 17 నెలలుగా నేనూ స్వయంగా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నాను. ఇంత మంచి చేస్తుంటే, చేసిన మంచిని వివరంగా చెబితే ప్రజలు ఇక కూటమితోనే ఉంటారు... ఇతర పార్టీల వైపు చూడనే చూడరు" అని ఆయన స్పష్టం చేశారు.పార్టీ కోసం త్యాగాలు చేసిన కార్యకర్తలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. "పార్టీనే సర్వస్వంగా భావించి ఆస్తులు, ప్రాణాలు త్యాగం చేసిన కార్యకర్తలు ఎందరో ఉన్నారు. వారి సేవలను గుర్తిస్తున్నాం. పనిచేసిన వారికి నామినేటెడ్ పదవులు ఇచ్చి గౌరవిస్తాం. కార్యకర్తల మనోభీష్టం మేరకే నాయకత్వం ముందుకు వెళుతుంది. మనకున్న 12 లక్షల మంది కుటుంబ సాధికార సారథులు, 46 వేల బూత్ కమిటీలు ప్రభుత్వ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి" అని ఆయన పిలుపునిచ్చారు.గత ప్రభుత్వ వైఫల్యాలను, విధ్వంసాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని చంద్రబాబు సూచించారు. "గత పాలకుల విధ్వంసం వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది. రాజకీయ కక్షతో నీరు-చెట్టు, ఉపాధి హామీ బిల్లులను కూడా నిలిపేశారు. మేం కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఎన్ఆర్ఈజీఎస్ బిల్లులను మంజూరు చేయించాం. ఇళ్ల పథకంలోనూ నిధులు దారి మళ్లించారు. వారి తప్పులను సరిదిద్దుతూ, ఉగాది నాటికి మరో 5 లక్షల ఇళ్లను పేదలకు అందిస్తాం. అర్హులైన ప్రతి పేదవాడికీ సొంతింటి కలను నెరవేర్చడమే మా లక్ష్యం. ఈ విధ్వంసంపై ప్రజల్లో ఇంకా చర్చ జరగాలి" అని అన్నారు.

డిసెంబర్ 3న రైతు సేవా కేంద్రాల్లో వర్క్‌షాప్‌లు, 5వ తేదీన జరిగే మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లలో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వ విధానాలను వివరించాలని ఆదేశించారు. కొన్నిచోట్ల అనర్హులు పెన్షన్లు పొందుతున్నారని, అయితే అర్హులైన ఒక్కరికి కూడా అన్యాయం జరగదని, పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తామని హామీ ఇచ్చారు. సోమవారం జరిగే పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని చంద్రబాబు కోరారు.

# భోగాపురం విమానాశ్రయం సిద్ధం..

**వచ్చే నెలలో ఎగరనున్న తొలి విమానం!**
**టెస్ట్ ఫ్లైట్‌కు సిద్ధమవుతున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం**
**డిసెంబర్ చివరిలో లేదా జనవరిలో తొలి విమానం ఎగిరే అవకాశం**
**ఇప్పటికే 92 శాతానికి పైగా పూర్తయిన నిర్మాణ పనులు**
**కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు పర్యవేక్షణతో పనుల్లో అనూహ్య వేగం**
**దేశంలోనే అతి పొడవైన రన్‌వేలలో ఒకటిగా 3.8 కి.మీ. రన్‌వే నిర్మాణం**

**ఉత్తరాంధ్ర** ప్రజల దశాబ్దాల కల అయిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే 92 శాతం పనులు పూర్తి కాగా, డిసెంబర్ చివరి వారం లేదా జనవరి మొదటి వారంలో టెస్ట్ ఫ్లైట్ నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా కింజరాపు రామ్మోహన్‌నాయుడు బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఈ ప్రాజెక్టు పనుల్లో అనూహ్యమైన వేగం కనిపిస్తోంది. ఆయన ప్రతి 15 రోజులకు ఒకసారి పనులను స్వయంగా పర్యవేక్షిస్తూ, గడువులోగా విమానాశ్రయాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నారు.దేశంలోనే అతి పొడవైన రన్‌వేలలో ఒకటిగా నిలిచేలా 3.8 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణం దాదాపు 99 శాతం పూర్తయింది. టెర్మినల్ భవనం 90%, ఏటీసీ టవర్ 72% పనులు పూర్తి చేసుకున్నాయి. మత్స్యాకారంలో నిర్మిస్తున్న ఈ విమానాశ్రయం ఇంటీరియర్ డిజైన్‌లో ఉత్తరాంధ్ర సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా తీర్చిదిద్దుతున్నారు. ఈ ప్రాజెక్టును జీఎంఆర్ సంస్థ నిర్మిస్తుండగా, ప్రస్తుతం 5,050 మంది కార్మికులు, ఇంజనీర్లు రేయింబవళ్లు పనిచేస్తున్నారు.విభజన హామీలలో భాగంగా, గతంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2019లో ఈ విమానాశ్రయానికి శంకుస్థాపన చేశారు. అయితే, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వ హయాంలో పనులు మందగించాయి. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు తిరిగి ఊపందుకున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు 'అల్లూరి సీతారామరాజు' పేరును ఖరారు చేశారు.విశాఖ పోర్టు నుంచి మూలపేట పోర్టు వరకు ప్రత్యేక కనెక్టివిటీ రహదారి, విశాఖ-భోగాపురం మధ్య మెట్రో రైలు మార్గం వంటి ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. ఈ విమానాశ్రయం పూర్తయితే ఉత్తరాంధ్ర పర్యాటక, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి కీలకంగా మారుతుందని భావిస్తున్నారు.

# ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరికలు



**భూపాలపల్లి నవంబర్ 30 పల్లె వెలుగు ప్రతినిధి:**
గణపురం మండలం ధర్మ రావు పేట గ్రామానికి చెందిన బిజెపి పార్టీ నాయకులు గట్టు భాస్కర్, బాపని ప్రవీణ్, ఊరటి శివ వీరు ఆదివారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆకుల శ్రీనివాస్ పూజారి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కోటగుళ్ళు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు



**భూపాలపల్లి నవంబర్ 30 పల్లె వెలుగు ప్రతినిధి:**
గణపురం మండలంలోని ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోట గుళ్ళు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం శుక్ల దశమి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతినెల గ్రామదేవతలకు నిర్వహించే పూజా కార్యక్రమాల్లో భాగంగా పంచామృతాలు కాళేశ్వరం త్రివేణి సంగమ జలాభిషేకం నిర్వహించారు. అనంతరం పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు నిర్వహించారు.

# జర్నలిస్టుల హక్కుల కోసం ఉద్యమాన్ని చేపడతాం

## నందవరం శ్రీనివాసులు,జిల్లా అధ్యక్షులు ఏపిజేయు యూనియన్




**పల్లె వెలుగు నంద్యాల రూరల్**
ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల యూనియన్ రాష్ట్ర కమిటీ వారి ఆదేశాల మేరకు ఏపీజేయు జిల్లా అధ్యక్షులు నందవరం శ్రీనివాసులు అధ్యక్షతన గౌరవ సభ్యులు నరసింహ మూర్తి, కె.శ్రీనివాసులు,శివశంకర్, ప్రేమ్ కుమార్, తబల శ్రీనివాసులు ఏపిజేయు జర్నలిస్టు యూనియన్ నంద్యాల జిల్లా కమిటీ సభ్యత్వం గుర్తింపు కార్డులను స్థానిక ఏపీజేయు యూనియన్ నంద్యాల జిల్లా కార్యాలయంలో శనివారం అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నందవరం శ్రీనివాసులు మాట్లాడుతూ, నంద్యాల జిల్లాలో ప్రతి ఒక్క జర్నలిస్టు సంక్షేమం, అభివృద్ధి కోసం ముందడుగు వేస్తుందనీ ,ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల యూనియన్ జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో ఉన్న జర్నలిస్టులతో చర్చించి సభ్యులుగా చేర్పించి జర్నలిస్టు అభ్యున్నతికి కృషిచేస్తామని తెలిపారు. అదేవిధంగా నంద్యాల జిల్లాలోని జర్నలిస్టుల పై దాడులు,దౌర్జన్యాలు,హత్యలకు పాల్పడుతున్న వారి పై కేసులు పెడితే రాజకీయ నాయకులు, పోలీసు అధికారులు తప్పు దోవ పట్టించి కేసులను కనుమరుగు చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఇస్తున్న అక్రిడేషన్ కార్డులను ఇవ్వకుండా కాలయాపన చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకొక వైపు రాష్ట్రంలో ఒక పెద్ద జర్నలిస్టు యూనియన్ అని చెప్పుకుంటున్న యూనియన్ కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ లేకుండా జర్నలిస్టు యూనియన్ ను నడుపుతున్నారని, అక్రిడేషన్ కమిటీలో ఉన్న కొన్ని జర్నలిస్టు యూనియన్లను తొలగించాలని విజయవాడ నగరంలో సమాచారం శాఖలో పిర్యాదు చేయడం జరిగిందనీ తెలిపారు. నంద్యాల జిల్లాలో ఏపీజేయు యూనియన్ లో ఉన్న ప్రతీ ఒక్క జర్నలిస్టుల సహకారంతో ఏపిజేయు యూనియన్ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో జర్నలిస్టుల హక్కుల కోసం ఉద్యమాన్ని చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ రోజు ఏపిజేయు యూనియన్ లో సభ్యత్వం పొందిన ప్రతీ ఒక్క సభ్యుడికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను అని అన్నారు.

# ఎమ్మార్వో ఆఫీస్ వద్ద ఉద్రిక్తత.. రైతుపై దాడి

## -నాపై వచ్చిన ఆరోపణలు అవాస్తవం: రూరల్ ఎమ్మార్వో రమేష్ బాబు
## - ఆక్రమణలపై చర్యలు తీసుకుంటున్నందుకే బురద చల్లుతున్నారు
## - గొడవ జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాం

**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**
కర్నూలు రూరల్ ఎమ్మార్వో కార్యాలయం ఆవరణలో శనివారం మధ్యాహ్నం చోటుచేసుకున్న దాడి ఘటన స్థానికంగా కలకలం రేపింది. భూ సమస్య పరిష్కారం కోసం కార్యాలయానికి వచ్చిన భూపాల్ నగర్‌కు చెందిన రవిశంకర్ గౌడ్ అనే రైతుపై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడగా, ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. అయితే, ఈ దాడి వెనుక తన ప్రమేయం ఉందంటూ బాధితుడు చేసిన ఆరోపణలను ఎమ్మార్వో రమేష్ బాబు తీవ్రంగా ఖండించారు. సదరు ఆరోపణల్లో ఎటువంటి వాస్తవం లేదని, తనపై ఉద్దేశపూర్వకంగా నిందలు మోపుతున్నారని ఆయన స్పష్టం చేశారు. **అసలేం జరిగిందంటే..** రవిశంకర్ గౌడ్ మరియు పక్క రైతు కె.గోపాల్ (ఎస్సీ) మధ్య రుద్రవరం గ్రామంలోని అసైన్మెంట్ భూమికి సంబంధించి వివాదం ఉంది. దీనిపై గోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, నిబంధనల ప్రకారం ఇద్దరికీ నోటీసులు జారీ చేసి శనివారం విచారణకు పిలిపించినట్లు ఎమ్మార్వో తెలిపారు. ఈ క్రమంలో కార్యాలయం బయట ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకోగా, రవిశంకర్ గౌడ్‌పై దాడి జరిగింది. ఈ దాడిలో గుర్నాథ్ అనే వ్యక్తి తన అనుచరులతో దాడి చేశారని బాధితుడు ఆరోపిస్తున్నారు.

**ఆరోపణలను ఖండించిన ఎమ్మార్వో..**



బాధితుడు రవిశంకర్ గౌడ్ తనపై చేస్తున్న ఆరోపణలపై ఎమ్మార్వో రమేష్ బాబు మీడియాకు వివరణ ఇచ్చారు. లి వెంటనే స్పందించాం: కార్యాలయం బయట గొడవ జరుగుతున్న విషయం తెలియగానే వెంటనే టూటౌన్ పోలీసులకు సమాచారం అందించామని, దగ్గరుండి కానిస్టేబుళ్ల సాయంతో బాధితుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి (GGH)కి పంపించామని తెలిపారు. సాయం చేసినా తనపై నిందలు వేయడం దురదృష్టకరమన్నారు.

**ఆక్రమణల కోపంతోనే:** రవిశంకర్ గౌడ్ తన పొలం పక్కన ఉన్న సహజ వాగును ఆక్రమించి నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్నారని ఎమ్మార్వో తెలిపారు. ఈ ఆక్రమణల తొలగింపునకు తాను చర్యలు తీసుకుంటున్నందున, ఆ కోపంతోనే తనపై ఇప్పుడు నిరసనగా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వివరించారు.

లి రైతులను ఇబ్బంది పెడుతున్నారు: రస్తాల విషయంలో కూడా రవిశంకర్ గౌడ్ చుట్టుపక్కల రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇటువంటి వ్యతిరేక చర్యలకు తాను సహకరించడం లేదన్న దురుద్దేశంతోనే ఈ దాడిని తనకు ఆపాదిస్తున్నారని ఎమ్మార్వో రమేష్ బాబు స్పష్టం చేశారు.
ప్రస్తుతం బాధితుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# నూతనముగా ఏర్పాటుచేసిన రోలెక్స్ కేఫ్ ను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి



**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో**
నంద్యాల పట్టణం దేనియలుపురం గేట్ వద్ద 1వ వార్డుకు చెందిన సంగా మల్లి, శివుడు, సంజీవ మరియు విక్రమ్ ఆహ్వానం మేరకు నూతనంగా ఏర్పాటు చేసిన “రోలెక్స్ కేఫ్” ను నంద్యాల టీడీపీ మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి , ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా భూమా బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూ కేఫ్ నిర్వాహకులు ప్రజలకు రుచికరమైన టీ, కాఫీ మరియు ఉత్తమమైన సేవలను అందించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు . వ్యాపారంలో రాణించి మరింత ఉన్నత శిఖరాలను చేరాలని ఆకాంక్షించారు. యువత వ్యాపార రంగంలో ముందుకు రావడం ప్రశంసనీయం అని అభినందించారు. కొత్తగా ప్రారంభమైన రోలెక్స్ కేఫ్ స్థానికులకు మంచి సేవలందించి ప్రత్యేక గుర్తింపు పొందాలని ఆకాంక్షిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

# జాతీయ గోపాల్ రత్న అవార్డు గ్రహీత అనురాధా ను అభినందించిన టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్



**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో**
జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి కేంద్ర ప్రభుత్వం నుండి ప్రతిష్టాత్మక జాతీయ గోపాల్ రత్న అవార్డు 2025 ను అందుకున్న నంద్యాల 15 వార్డ్ రెవెన్యూ కోటర్స్ కు చెందిన చాకలి అనురాధా కి టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఉత్తమ కృత్రిమ గర్భధారణ టెక్నీషియన్ (Best Artificial Insemination Technician) విభాగంలో తృతీయ బహుమతిని దక్కించుకున్న అనురాధా ని అభినందించేందుకు, ఎన్ఎండి ఫయాజ్ స్వయంగా రెవెన్యూ కోటర్స్ లోని ఆమె నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ పశు సంవర్ధక రంగంలో అనురాధా కృషి అభినందనీయమని, ఆమె విజయం నంద్యాల జిల్లాకు మరియు రాష్ట్రానికి గర్వకారణమని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలు జాతీయ స్థాయిలో ఈ విధంగా గుర్తింపు పొందడం ఇతర యువతకు, మహిళలకు ఎంతో స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. చకాలి అనురాధా అందించిన సేవలు, ఆమె నిబద్ధత కారణంగానే ఈ ఉన్నత పురస్కారం లభించిందని, ఆమె భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని ఎన్ఎండి ఫయాజ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వేణు, ఎబినైజర్, నాగేశ్వరరావు,రమేష్ పాల్, కామిని మల్లికార్జున, కరీం, అడ్వకేట్ ఖలీల్, దీపక్ రెడ్డి, బుగ్గ రాముడు, ఉప్పరి సురేష్ కుమార్ , ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పెనుకొండ, సదర్ చౌక్‌లో 753వ వార్షిక ఉర్స్ షరీఫ్ వేడుకలు మంత్రి ఎన్ఎండి ఫరూక్ మరియు వారి కుటుంబ సభ్యులకు ఆహ్వానం



**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, సత్యసాయి జిల్లా, పెనుకొండలోని సదర్ చౌక్‌లో ఉన్న దర్గా షరీఫ్‌లో ప్రతి సంవత్సరం జరిగే ఉర్స్ ఉత్సవాలు ఈసారి అంగరంగ వైభవంగా డిసెంబర్ 2 వ తేదీ జరగనున్నాయిని. సయ్యద్ షా బాబా ఫక్రుద్దీన్ (ర.అ) హసాని వలీ హుస్సైని సోహ్రావర్ది సాహెబ్ దర్గాలో, వారి 753వ వార్షిక ఉర్స్-ఎ-షరీఫ్ (ఉత్సవాలు) మరియు సందల్ ముబారక్ వేడుకలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ కి మరియు వారి కుటుంబ సభ్యులకు ఆహ్వానం పలుకుతూ ఆహ్వాన పత్రికను టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ కి తెలుగుదేశం పార్టీ క్యాంపు కార్యాలయం నందు పీఠాధిపతులు ఇవ్వడం జరిగింది .ఈ కార్యక్రమంలో ఖ్వాజా సయ్యద్ షా బాబా నజర్ హుస్సైని సోహ్రావర్ది సాహెబ్ , ఖ్వాజా సయ్యద్ షా బాబా రుక్నుద్దీన్ అహ్మద్ హుస్సైని సోహ్రావర్ది సాహెబ్ మరియు నంద్యాల 11 వ వార్డు టిడిపి ఇంచార్జ్ అఫ్జల్ , అలీ , బషీర్ పాల్గొన్నారు.

# చాగలమర్రిలో అంగరంగ వైభవంగా అయ్యప్ప స్వామి అంబులం పూజ ( పడి పూజ )



**చాగలమర్రి .పల్లె వెలుగు:నంద్యాల** జిల్లాలో రెండవ శబరిమలైగా పేరు గాంచిన చాగలమర్రి పట్టణములో శ్రీ అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యములో ఆదివారం పడి పూజ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు.ఏకశిల పదునెట్టాంబడి శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయములో ఆలయ ప్రధాన పూజారి పవన్ కుమార్ ఆధ్వర్యములో ఉదయం గణపతి పూజ , పుణ్యహావాచకం , సత్తెనపల్లి వాస్తవ్యులు దీక్షితులు శర్మ ఆధ్వర్యములో బలిహరణ గణపతి హొమం , క్షీరాభిషేకం ( 108 కలశములతో అయ్యప్ప స్వామికి అభిషేకం చేశారు ). తొమ్మండ్రు గురు సాయి శ్రీయాన్ష్ కలశం పట్టుకొని మేళతాళాలతో అయ్యప్ప స్వామికి అభిషేకం నిర్వహించారు.కూరపాటి జగదీష్ అయ్యప్ప స్వామి విగ్రహం దేవాలయం చుట్టూ మేళతాళాలతో తిప్పి అయ్యప్ప స్వామికి పూజలు జరిపించారు.పూజలో అయ్యప్ప స్వాములు గురు స్వాములతో చిందులు వేస్తూ వైభవంగా అయ్యప్ప భజనలు పాడారు.పూజలో భాగంగా మహా మంగళహారతి భక్తులకు ఇచ్చి తీర్థ ప్రసాదాలు ఏర్పాటు చేశారు.గురు స్వాములు మాట్లాడుతూ అయ్యప్ప దీక్ష ధరించి ఎవరైనా శబరిమలై వెళ్లలేని వాళ్ళు వారి సౌకర్యార్థం చాగలమర్రి అయ్యప్ప స్వామి సన్నిధిలో విరమించుకోవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ అయ్యప్ప స్వామి సేవా సమాజం అధ్యక్షుడు సుంకు జనార్ధన్ రావు , ప్రధాన కార్యదర్శి మదళ్ళపల్లె లక్ష్మీనారాయణ , కమిటీ సభ్యులు , గురు స్వాములు జయదేవ రెడ్డి , రాయుడు స్వామి , వందవాసి నాగేశ్వర రావు , వందవాసి మహేష్ , భక్తులు , తదితరులు పాల్గొన్నారు.

# నేటి ప్రజావాణి తాత్కాలిక రద్దు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాలపల్లి నవంబర్ 30 పల్లె వెలుగు ప్రతినిధి:**



జయశంకర్ జిల్లా యంత్రాంగం గ్రామ పం చాయతీ ఎన్నికల నిర్వ హ ణలో నిమగ్నమై ఉన్న నేప థ్యంలో నేడు నిర్వ హిం చాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని తా త్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. కాబట్టి ప్రజలు ఫిర్యా దులు ఇచ్చేందుకు కలె క్టరేట్ కార్యాలయానికి రావొ ద్దని ఆయన సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తి అయ్యే వరకు మోడల్ కోడ్ అమలులో ఉన్నందున అప్పటి వరకు ప్రజావాణి రద్దు చేయబడదని ఆయన స్పష్టం చేశారు.

# వీలైనన్ని ఎక్కువ గ్రామాలు ఏకగ్రీవం అయ్యేలా చేయండి

**- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



**భూపాలపల్లి నవంబర్ 30 పల్లె వెలుగు ప్రతినిధి:**
సర్పంచ్ ఎన్నికల్లో శాయంపేట మండలంలో వీలైనన్ని ఎక్కువ గ్రామాలు ఏకగ్రీవం అయ్యేలా చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు. ఆదివారం శాయంపేట మండల కేంద్రంలోని ఎస్ వీ కే కే వేడుకల మందిరంలో పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులతో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాంగ్రెస్ శ్రేణులకు పలు సూచనలు చేశారు. అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను సర్పంచులుగా గెలిపించుకోవాలని, వీలైనన్ని ఎక్కువ గ్రామాలు ఏకగ్రీవం అయ్యేలా చూసుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు వచ్చిన గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఎక్కడైనా ఆర్థికంగా బలహీనంగా ఉంటే, ఆ గ్రామానికి చెందిన ముఖ్య నాయకులు ఆ అభ్యర్థి విజయానికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేనప్పుడు పార్టీకి కష్టకాలంలో అండగా నిలిచిన కార్యకర్తలను, నాయకులను సర్పంచ్ అభ్యర్థిగా నిలబెట్టుకుని గెలిపించుకుని రావాలని పిలుపునిచ్చారు.

# డిసెంబర్ 01న ప్రజా విజ్ఞప్తుల స్వీకరణ

**అర్జీలు 'meekosam.ap.gov.in" లో నమోదు చేసుకోవచ్చు.**

**సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1100**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**



డిసెంబర్ 01న (సోమ వారం) నంద్యాల జిల్లా కలెక్టరేట్‌తో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మున్సి పల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీలు స్వీకరిం చబడునని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ అర్జీలను ప్రత్యక్షంగా ఇవ్వడమే కాకుం డా, ఆన్లైన్‌లో meekosam.ap.gov.in ద్వారా కూడా సమర్పించవచ్చన్నారు. అర్జీ పరిష్కార స్థితి గురించి తెలుసుకోవడానికి వెబ్‌సైట్‌లోనూ లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చని ఆమె చెప్పారు. అర్జీదారులు మొదట తమ మండల, డివిజన్ లేదా మున్సిపల్ కార్యాలయంలోని అధికారులకు అర్జీలు ఇవ్వాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలు మాత్రమే జిల్లా కేంద్రంలోని వేదికకు రావలసిందిగా కలెక్టర్ సూచించారు. అదేవిధంగా కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో ఉదయం 9:30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె ఆదేశించారు.

# హెచ్ఐవి పై అవగాహన

**-హెచ్ఐవి అనేది దీర్ఘకాలిక వ్యాధి**

**-డాక్టర్. ఎ అరుణ కుమారి**

**ఎంబీబీఎస్ డి జి ఓ ఎఫ్ఏజీఈ**

**ఇన్ ఫర్టిలిటీ స్పెషలిస్ట్ గోల్డ్ మెడల్**

**నెరవాటి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నంద్యాల**



**నంద్యాల ప్రతినిధి. నవంబరు 30. (పల్లెవెలుగు ):** ఇంటర్నేషనల్ ఎయిడ్స్ సొసైటీ 2025 డిసెంబర్ 1న అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా "అంతరాయాన్ని అధిగమించడం, ఎయిడ్స్ ప్రతిస్పందన మార్చడం" అనే నినాదాన్ని ఇచ్చింది. నిధుల సంక్షోభం కారణంగా హెచ్ఐవి నివారణ సేవలకు అంతరాయాలు కలుగుతున్నాయి. ఈ థీమ్ స్థిరమైన రాజకీయ నాయకత్వం, అంతర్జాతీయ సహకారం మరియు మానవ హక్కుల కేంద్రీకృత విధానాలకు పిలుపునిస్తుంది. హెచ్ఐవి అనేది దీర్ఘకాలిక వ్యాధి. ఎలా వ్యాపిస్తుందో అర్థం చేసుకోవాలి. పరీక్ష యొక్క ప్రాముఖ్యత తెలుసుకోవాలి. అలాగే ప్రభావవంతమైన నివారణ పద్ధతుల గురించి కూడా తెలుసుకోవచ్చు. హెచ్ఐవి శరీర ద్రవాల వల్ల వ్యాపిస్తుంది: రక్తం, వీర్యం, మలద్రవాలు, యోని ద్రవాలు మరియు తల్లిపాలు ద్వారా సంక్రమిస్తుంది. ప్రభావవంతమైన నివారణ ఔషధం లేకుండా సంపర్కం చేయరాదు. కలుషిత సూదులు మరియు సిరంజిలు ద్వారా సంక్రమించవచ్చు. గర్భధారణ సమయంలో, ప్రసవ సమయంలో లేదా పాలిస్తున్నప్పుడు తల్లి నుండి బిడ్డకు సంక్రమించవచ్చు. హెచ్ఐవి కౌగిలింత ద్వారా, కరచాలనం వలన, నోరుమూసుకొని ముద్దు పెట్టుకోవడం వలన సంక్రమించదు. గాలి ద్వారా, నీరు ద్వారా సంక్రమించదు. దోమలు లేదా ఇతర కీటకాల ద్వారా సంక్రమించదు.

**నివారణకు:**

1. కాండోములను వాడాలి
2. ఫ్రీ ఎక్స్పోజర్ ప్రొఫైల్ ఆక్సిస్: హెచ్ఐవి లేనివారు రోజువారి ఔషధాన్ని తీసుకోవడం ద్వారా హెచ్ఐవి వచ్చే ప్రమాదాన్ని తగ్గించుకోగలరు. 3. పోస్ట్ ఎక్స్పోజర్ ప్రొఫైల్ ఆక్సిస్: ఎక్స్పోజిట్ అయిన 72 గంటల్లోపు యాంటీ హెచ్ఐవి మందులను తీసుకోవడం ద్వారా నివారించవచ్చు. 4. శుభ్రమైన సూదులను వాడాలి. 5. ఆంటీ రిట్రో వైరల్ థెరపీని తీసుకోవాల్సి ఉంటుంది. 13 నుంచి 64 సంవత్సరాల మధ్య వయసు ఉన్నవారు ప్రతి ఒక్కరు సాధారణ ఆరోగ్య పరీక్షల భాగంగా కనీసం ఒక్కసారైనా పరీక్షించుకోవాలి. ప్రమాదం ఉన్న వ్యక్తులు తరచూ పరీక్షించుకోవాలి. పరీక్ష సరళమైనది.

# నంద్యాల జిల్లా వ్యాప్తంగా 06 పోలీస్ స్టేషన్ల పరిధిలలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహణ

**అనుమానితులు,నేర చరిత్ర గలవారు, రౌడీ షీటర్లు ఇళ్లలో సోదాలు.**

**సరైన ధ్రువపత్రాలు లేని 15 వాహనాలు, 85 (180) ఎం ఎల్ అక్రమ మద్యం బాటిల్లు 20 లీటర్ల నాటు సారాయి స్వాధీనం.**

**పోలీస్ వారి తక్షణ సహాయం కొరకు 112 టోల్ ఫ్రీ నంబర్ కు కాల్ చేసి సహాయం పొందవచ్చు.**

**పల్లె వెలుగు నంద్యాల క్రైమ్**



నంద్యాల జిల్లా వ్యాప్తంగా ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు శాంతిభద్రతల పరిరక్షణ నేర నియంత్రణ కొరకు జిల్లా వ్యాప్తంగా కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాలన్న జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ఆదేశాలమేరకు ఆయా సబ్ డివిజన్ పోలీస్ అధికారుల సూచనలతో జిల్లా వ్యాప్తంగా 06 పోలీస్ స్టేషన్ ల పరిధిలలో ఈ ఆపరేషన్స్ నిర్వహించడం జరిగింది. కార్డెన్ అండ్ సెర్చ్ చేసిన పోలీస్ స్టేషన్స్ వివరాలు
1.నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని వైఎస్ఆర్ నగర్ . 2.నందివర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని రామకృష్ణాపురం గ్రామం. 3.అవుకు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇస్రానాయక్ తండ గ్రామం. 4.నందికొట్కూరు రూరల్ సర్కిల్ మిడ్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని చెరుకుచెర్ల గ్రామం . 5.ఆత్మకూరు రూరల్ సర్కిల్ కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ముసలమడుగు గ్రామం. 6.నందికొట్కూరు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మారుతీ నగర్ మొదలగు ప్రాంతాలలో ఆయా పోలీస్ స్టేషన్ అధికారుల ఆధ్వర్యంలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్స్ నిర్వహించి సరైన ధ్రువపత్రాలు లేని 15 మోటార్ సైకిళ్లతో పాటు అక్రమ మద్యం కలిగి ఉన్న వ్యక్తులను స్వాధీనంలోనికి తీసుకుని వారి వద్ద నుండి సుమారు 85 (180) క్వాటర్ బాటిల్లను మరియు 20 లీటర్ల నాటు సారాయిని స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ మరియు నేరాలను నివారించడమే లక్ష్యంగా మరియు గ్రామాలలో ఎలాంటి గొడవలు అల్లర్లు జరగకుండా నివారించుటకు పోలీసులు ప్రజల కొరకు ఉన్నారనే భరోసా కల్పించడం కొరకు ఈ కార్డెన్ అండ్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించడం జరిగిందని తెలియజేశారు. ఈ సెర్చ్ ఆపరేషన్ లో పోలీస్ అధికారులు మరియు సిబ్బంది బృందాలుగా ఏర్పడి గ్రామంలోని అనుమానితులు, నేర చరిత్ర గల వారి ఇళ్లలో సోదాలు నిర్వహించడం జరిగింది.
అనంతరం గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి సిసి కెమెరాల ప్రాధాన్యతను మరియు రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ప్రతి ఒక్కరూ మోటార్ సైకిల్ పై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ ధరంచనిచో జరిగే ప్రమాదములు మరియు ఆటోలలో ప్రయాణికులను పరిమితికి మించి రవాణా చేయడంవలన కలుగు ప్రమాదములు, ఓవర్ స్పీడ్, డ్రైవింగ్ లైసెన్స్, వాహనము యొక్క ఆర్.సి మరియు ఇన్సూరెన్స్ యొక్క ప్రాధాన్యత మరియు డయల్ యువర్ 112 కాల్ యొక్క ప్రాధాన్యత గురించి,తదితర అంశాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఏవరైనా చట్టవ్యతిరేక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, పోలీసు అధికారులు హెచ్చరించారు. కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ లు నిరంతరం కొనసాగుతుంటాయని పేర్కొన్నారు.

# చిన్నారి తిరుజ రెడ్డి మొదటి పుట్టినరోజు వేడుకలలో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్



**పల్లె వెలుగు నంద్యాల**
గోస్పాడు మండలం టీడీపీ సీనియర్ నాయకులు వంటలగల గ్రామ సీలం భాస్కర రెడ్డి, సీలం రమాదేవి దంపతుల ఆహ్వానం మేరకు నంద్యాల స్థానిక రాజారెడ్డి ఫంక్షన్ హాల్ నందు నిర్వహించిన చిన్నారి తిరుజ రెడ్డి మొదటి పుట్టినరోజు వేడుకలకు ముఖ్యఅతిథిగా టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ హాజరై చిన్నారిని ఆశీర్వదించారు . ఈ సందర్భంగా ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ చిన్నారి తిరుజ రెడ్డి మంచి ఆరోగ్యంతో, అష్టైశ్వర్యాలతో కలకాలం సుఖంగా జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అన్నారు . ఈ కార్యక్రమంలో గోస్పాడు మండల కన్వీనర్ తులసీశ్వర్ రెడ్డి, ఫరూక్ హుస్సేన్, మనోహర్, గోపాల్ రెడ్డి, అస్మద్దీన్, కృపాకర్, అజ్మీర్, బుగ్గ రాముడు , ప్రసాద్ రెడ్డి , జోసఫ్, జార్జ్ , శ్రీకాంత్ , హరుణ్ బేగ్ , మరియు గోస్పాడు మండల, నంద్యాల టౌన్ టిడిపి నాయకులు, కార్యకర్తలు, సీలం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# బొలెరోలో తడికలు పట్టివేత




**బండి ఆత్మకూరు పల్లె వెలుగు నవంబర్ 30 :** అటవీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్ ఎస్ టి ఆర్ మణ్యాత్మురు రేంజ్ అధికారి నాసిర్ ఝా ఆదేశాల మేరకు కు బండి ఆత్మకూరు రేంజ్ లోని సంత జూటూరు వద్ద ఆదివారం బొలెరో వాహనాన్ని అటవీ అధికారులు పట్టుకున్నారు. వాహనంలో తడికెళ్లను అక్రమంగా తరలిస్తుండగా అటవీ క్షేత్రాధికారి, మొబైల్ పార్టీ, నారపరెడ్డి కుంట సెక్షన్ సిబ్బంది కలిసి వాహనాన్ని అధీనంలోకి తీసుకొని కేసు నమోదు చేశారు. పట్టుబడ్డ వాహనాన్ని గాజులపల్లె ప్రభుత్వ కలప డిపోకు తరలించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాసిర్ ఝా మాట్లాడుతూ అటవీ ప్రాంతం నుండి అక్రమంగా వెదురులతోపాటు కలపను తీసుకువచ్చి, గృహోపకరణాలు చేసి అక్రమంగా రవాణా చేయడం చట్టరీత్యా నేరమని అన్నారు. అటవీ ప్రాంతం నుండి కడప తెచ్చిన అమ్మిన శిక్షార్హులవుతారని వారిపై చట్టరీత్యా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉప అటవీ క్షేత్ర అధికారి హైమావతి, మొబైల్ పార్టీ సెక్షన్ ఆఫీసర్ నాగేంద్రయ్య, నారపురెడ్డి కుంట సెక్షన్ ఆఫీసర్ కాశీం నాయక్, బీట్ ఆఫీసర్ ప్రసన్న, రాజేష్ లతోపాటు ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

## ఆదోని అభివృద్ధి జిల్లాతోనే సాధ్యం

**ఆదోని జిల్లా అవశ్యకత పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు వినతి.**

**ఏపీ బెస్త సంక్షేమం అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శ్రీ బెస్త రామాంజనేయులు**



**ఆదోని పల్లె వెలుగు నవంబర్ 30**
ఈ రోజు మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం లో ఏపీ బెస్త సంక్షేమం అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బెస్త రామాంజనేయులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదోని జిల్లా అవశ్యకత పై ఆదోని జిల్లా పై ప్రజల్లో దశాబ్దాలుగా ఉన్న ఆకాంక్ష ను తెలియజేస్తూ అన్ని అంశాలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.అందులో బాగంగా పలు విషయాలు తెలియజేస్తూ ఆదోని ప్రాంతం 160 సంవత్సరాల పైబడ్డ అతి పురాతనమైన మున్సిపాలిటి అని, అతి పెద్ద వ్యవసాయ మార్కెట్, చెన్నై, ముంబయి బ్రాడ్జ్ లైన్, గుంతకల్లు, తుంగభద్ర స్టేట్ హైవే, వాణిజ్యపరంగా చాలా పేరొందిన ఆదోనిని జిల్లాగా ప్రకటించాలని ఆదోని డివిజన్ పరిధిలో ఉన్న ఎమ్మిగనూరు ఆలూరు పత్తికొండ మంత్రాలయం నియోజకవర్గాల ప్రజల ఆకాంక్ష అని తెలిపారు ఆదోని భౌగోళికంగా కేంద్రం లో ఉండి తుగ్గలి మద్దికెర, చిప్పగిరి కౌతాళం వంటి చివరి గ్రామాలకు 150 కి.మీ దూరం కలిగిన కర్నూలు జిల్లా కేంద్రం కావున ఆరోగ్య రీత్యా జిల్లా కు అత్యవసరంగా వెళ్లలేని పరిస్తితి తో ప్రాణాలు అర చేతుల్లో పెట్టుకుని పోవాల్సిన పరిస్థితి. గతం లో అనేక ఫ్యాక్టరీలు ఉన్న నేడు మూతబడి ఎన్నో వేల కార్మికులకు జీవనోపాధి లేకుండా పోయారు.కావున ఆదోని జిల్లాగా ఏర్పాటైతే విద్యా, వైద్య, సాగునీరు, వాణిజ్య ఉద్యోగ అవకాశాలు మెరుగుపడి ఈ ప్రాంతాలన్ని అభివృద్ధి చెందుతాయని, ఆదోని జిల్లా ఏర్పాటైతే ఇతర 4 నియోజకవర్గాలకు 30 కి.మీ. దూరంలోనే జిల్లా కేంద్రం అందుబాటులో ఉంటుంది అన్ని ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులో ఉంటూ దురా భారం తగ్గుతాయని మెరుగైన వసతులు ,మౌలిక సదుపాయాలు కలిగే అవకాశాలు ఉన్నందున ఆదోని ప్రాంతానికి ప్రత్యేక జిల్లా హెూదా ఇవ్వడం అత్యవసరం ఆదోని ని జిల్లాగా ప్రకటించి ప్రజల ఆకాంక్షలను తీర్చాలని కోరడమైనది.ఇందుకు చంద్ర బాబు నాయుడు సానుకూలంగా స్పందించారు.

## పికప్ ఆనకట్ట వద్ద గుర్తుతెలియని మృతదేహం



**బండి ఆత్మకూరు పల్లె వెలుగు నవంబర్ 30 :** బండి ఆత్మకూరు మండలం పరిధిలో ఉన్న సంత జూటూరు పికప్ ఆనకట్ట వద్ద గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించారు. ఆదివారం సాయంత్రం ఆనకట్ట వద్ద చేపలు పడుతున్న జాలర్లకు గుర్తు తెలియని మృతదేహం కంటపడింది. నీటి ప్రవాహం తో పాటు సుడిగుండాలు ఉన్న కారణంగా మృతదేహం అక్కడే ఉండిపోయింది. మృతదేహం నీటిలో అక్కడక్కడే తిరుగుతూ ఉండటంతో శవం ఆచూకీ గుర్తుపట్టడం సాధ్యం కాలేదు. మృతదేహం మాత్రం మగవ్యక్తి దని జాలర్లు గుర్తించారు.

## ముద్దాయిలు గుర్తింపు



**బండి ఆత్మకూరు పల్లె వెలుగు నవంబర్ 30:** అటవీ శాఖ అధికారులకు బొలెరో వాహనంలో ఆదివారం పట్టుబడిన తడికల లారీలకు సంబంధించి ముద్దాయిలను గుర్తించడం జరిగిందని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాసిర్ ఝూ పేర్కొన్నారు. ముద్దాయిలు సంతజూటూరు గ్రామానికి చెందిన నరసప్ప, శ్రీనివాసులుగా గుర్తించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ విషయంపై వారిని విచారిస్తే నారాయణపురం గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో అక్రమంగా ప్రవేశించి వెదురులను నరికి వాటిని 500 తడికెలుగా అల్లుకొని ఏ పి 39 టి జె 1026 నంబరు గల బొలెరో వాహనంలో తీసుకొని తెలంగాణ రాష్ట్రంలోని గద్వాల్ ప్రాంతంలో అమ్మడానికి వెళ్తున్నామని పేర్కొన్నారని రేంజర్ తెలిపారు. వారిని దోషులుగా నిర్ధారించి కస్టడీలోకి తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. అక్రమంగా తరలిస్తున్న వెదురు తడికలు విలువ సుమారు లక్ష రూపాయల వరకు ఉంటుందని పేర్కొన్నారు. అడవిలోనికి ప్రవేశించి వెజ్జార్లను గాని కలపను గాని నరికి తరలించిన వాటితో గంపలు తడికలు మొదలగు వస్తువులను తయారు చేసుకొని అక్రమంగా రవాణా చేస్తే అటువంటి వ్యక్తులను అటవీ చట్టాల ప్రకారం రిమాండ్కు పంపడంతో పాటు కఠినమైన శిక్షలకు గురి చేయడం జరుగుతుందని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాసిర్ ఝూ హెచ్చరించారు.

# తలరాతను మార్చే శక్తి గీతకే ఉన్నది

**పాణ్యం శాసనసభ్యులు గౌరు చరితమ్మ**
**-తి.తి.దే. కళ్యాణమండపం**
**పునరుద్ధరించుకోవడం శుభదాయకం**



**కర్నూలు. నవంబరు 30 . (పల్లె వెలుగు ):**తలరాతను మార్చగలిగే శక్తి భగవద్గీతకు ఉన్నదని, సాక్షాత్తు శ్రీకృష్ణ పరమాత్ముడు అర్జునుడిని నిమిత్తంగా చేసుకొని యావత్ మానవ సమాజానికి దారి చూపాడని, భగవద్గీత సమస్త గ్రంథాల సారాంశమని, భగవద్గీతను అధ్యాయం చేస్తే పరిపూర్ణ మానవుడిగా రూపుదిద్దుకుంటాడని పాణ్యం శాసనసభ్యులు గౌరు చరితమ్మ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం తి.తి.దే. కళ్యాణ మండపం, కర్నూలు నందు నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పఠన పోటీలలో వారు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులు చెప్పిన శ్లోకాలను శ్రద్ధతోవిని వారిని అభినందించారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా 75 మంది ఈ పోటీల్లో పాల్గొని వారి యొక్క ప్రతిభను చాటారు. కార్యక్రమానికి న్యాయని నేతలుగా డాక్టర్ తొగట సురేశ్ బాబు, ఎస్.వరలక్ష్మి, సువర్ణ జోషి, పసుపులేటి నీలిమ, బి మురళిధర్, జి.వనజ కుమారి, డాక్టర్ దేవి దయానందసింగ్, ఎస్. భానుజీ రావు, ఎల్. శిరీషలు వ్యవహరించారు. విశిష్ట అతిథిగా హాజరైన డాక్టర్ పూజారి మోక్షేశ్వరుడు మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో భగవద్గీత అధ్యాయనం జరగాలని సూచించారు. విజేతరకు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి ప్రశంసా పత్రం, తితిదే జ్ఞాపికతో పాటు నగదు బహుమతిని అందించారు. మూడు విభాగాలుగా ఈ పోటీలు నిర్వహించారు. ఆరు నుంచి తొమ్మిది తరగతుల విభాగంలో కె.పవన్ కుమార్, జి శ్రీవర్షిత, జె. లక్ష్మీకాంత్,10 మరియు ఇంటర్ విద్యార్థుల విభాగంలో డి.లలిత, కె. కృపారాణి, ఆర్. దేవమణి,18 నుండి 45 సంవత్సరాల లోపు విభాగంలో సి. శ్రీకాంత్, కర్నూలు, బి. శ్రీకృష్ణ పరబ్రహ్మ, మంత్రాలయం, జి భరత్ శర్మ, కర్నూలు వరుసగా ప్రథమ ద్వితీయ తృతీయ విభాగాల్లో విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. కళ్యాణ మండపం అందుబాటులోకి తేవడం పట్ల శాసనసభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ముందుగా గీతాచార్యుని చిత్రపటానికి పూజలు చేసి, విద్యార్థులతో ముచ్చటించారు. మొట్ట మొదటి కార్యక్రమాన్ని విద్యార్థులతో ప్రారంభించుకోవడం శుభదాయకమని, నిర్వాహకులను అభినందించారు.

# మైదాన ప్రాంత గిరిజనుల హక్కుల సాధనకై ఉద్యమిద్దాం

**గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి.**
**గిరిజనులకు అసెంబ్లీలో ప్రాతినిథ్యం కల్పించాలి .**
**జిపిఎస్ జాతీయ అధ్యక్షుడు, మాజీ రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్.**
**కృష్ణ జిల్లా మచిలీపట్నంలో గిరిజనుల ఆత్మీయ ముఖ్య నేతల రౌండ్ టేబుల్ సమావేశం.**
**గిరిజన హక్కుల పరిరక్షణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి.**
**జిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్**
**ఎస్టీ జాబితాలోకి ఇతర కులాలను చేరిస్తే ఒప్పుకునేది లేదు..**
**మచిలీపట్నం రౌండ్ టేబుల్ సమావేశంలో గిరిజన సంఘాల నేతల తీర్మానం**



**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో**
మైదాన ప్రాంత గిరిజనులకు అన్యాయం జరుగుతోందని, రాష్ట్రంలో ఉన్న గిరిజనులు హక్కుల సాధనకై ఉద్యమించాలని, గిరిజనులకు అసెంబ్లీలో ప్రాతినిథ్యం కల్పించాలని గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ అన్నారు. మచిలీపట్నం ఎన్ కన్వెన్షన్ హాల్లో ఆదివారం గిరిజన ప్రజా సమాఖ్య, విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన గిరిజన ప్రజా చైతన్య యాత్ర రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. రాష్ట్రంలోని మైదాన ప్రాంత గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించి, గిరిజన హక్కుల పరిరక్షణకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని అన్నారు.

వివిధ గిరిజన సంఘాల ముఖ్య నాయకులతో, మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జాతీయ అధ్యక్షుడు మాజీ ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. దేశానికి స్వాతంత్రం వచ్చి 80 సంవత్సరాలు కావస్తున్న నేటికీ రాష్ట్రంలోని లక్షలాదిమంది గిరిజనులకు కనీసం కూడు, గూడు, నీడ లేక పరితపిస్తున్నారని, ఇప్పటికీ రేషన్ కార్డు, ఆధార్ కార్డు లేక దుర్భరమైన జీవితాలు జీవిస్తున్నారని అన్నారు. నేటికి ఆధార్ కార్డు లేకపోవడం వల్ల ప్రభుత్వ సంక్షేమ ఫలాలకు దూరం అవుతున్నారని చెప్పుకొచ్చారు. అంతేకాకుండా గిరిజన జాతీ అభివృద్ధికి ప్రతి ఏటా ప్రభుత్వాలు కేటాయించే కోట్లాది రూపాయలు నిధులను దారి మళ్లించకుండా వినియోగించబడాలంటే చట్టసభలలో గిరిజనుల తరపున ప్రాతినిత్యం వహించే వ్యక్తి ఉండాలన్నారు. అందుకొరకై మన హక్కుల సంరక్షణ కొరకై సంకటితంగా మనమంతా కలిసికట్టుగా ఐక్యమత్యంతో ఉద్యమించాలన్నారు.ఎస్టిలో ప్రధానం గా సుగాలి, చెంచు, ఎరుకల, యానాది నక్కల ఇలా అనేక జాతులు ఉన్నారన్నారు వీరందరికీ సరైన సమాన ప్రాతినిధ్యం లేదన్నారు. రాష్ట్రంలోని గిరిజనులకు రాజకీయంగా మన్యం ప్రాంతాలకు పరిమితం చేయటం వలన మైదాన ప్రాంత గిరిజనులకు గత 58 సంవత్సరాలుగా జరగవలసిన అన్యాయం భారీగా జరిగిపోయింద న్నారు. ఇకనైనా మేలుకొని మన హక్కులను కాపాడు కునేందుకు కృషి చేయాలన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా ఎస్టీ జాబితాలోకి ఇతర కులాలను చేర్చే ప్రతిపాదనను తీసుకోరావటం చాలా బాధాకరంగా ఉందన్నారు. అభివృద్ధికి నోచక ఇప్పటికీ దిక్కులేని స్థితిలో గిరిజన ప్రజానీకం జీవిస్తున్నారనే విషయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రహించాలన్నారు. 1962 నుండి 67 వరకు చట్టసభలకు నిర్వహించిన ఎన్నికల్లో జిల్లాలను ఒక యూనిట్గా తీసుకొని రిజర్వేషన్ అందించడం వలన మైదాన ప్రాంతాల్లో అప్పటి ఎన్నికల్లో పాల్గొనే అవకాశం ఉండేది. మైదాన ప్రాంతాల్లో కదిరి, కావలి, మాచర్ల, జగ్గయ్యపేట నాలుగు అసెంబ్లీ స్థానాలకు రిజర్వేషన్ కల్పించి చట్టసభలో ప్రాతినిథ్యం వహించారు కానీ 1967లో ప్రభుత్వ పాలన విధానాల్లో జరిగిన మార్పుల వలన జిల్లా యూనిట్ తీసుకోకుండా రాష్ట్ర యూనిట్ గా తీసుకోవడం వలన ఏజెన్సీ ప్రాంతాలకి మాత్రమే గిరిజన రిజర్వేషన్ పరిమితమయ్యాయి. అలా చేయడంతో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. 2026 సంవత్సరంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంలో శాసనసభ స్థానాలు 175 నుంచి 225 పెంపునకు కొత్తగా ఏర్పాటు కానున్న ఆ నియోజకవర్గాలలో రాష్ట్ర జనాభాలో సగ భాగంగా ఉన్న మైదాన ప్రాంత గిరిజనులకు సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాలలో ప్రాతినిత్యం లభించేలా మనమందరం పోరాడవలసిన సమయం ఆసన్నమైందన్నారు. జాతి భవిష్యత్తు కోసం, అభ్యున్నతి కోసం, జాతీ వెలుగు కోసం, ఉద్యమ బాట మొదలుపెట్టి ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమాన్ని ప్రతి గిరిజన ప్రాంతాల్లో చేరేలా ప్రతి ఒక్క గిరిజనుడు కృషి చేయాలన్నారు.అనంతరం రౌండ్ టేబుల్ సమావేశంలో సంఘ నాయకులంతా సంఘీభావం తెలిపారు ప్రజా చైతన్య యాత్ర రౌండ్ టేబుల్ కార్యక్రమంలో గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, కార్పొరేటర్ యాకసిరి వెంకటేశ్వరరావు, గిరిజన నేతలు పద్మరాజు, రాష్ట్ర కార్యదర్శి రవి నాయక్, సుగాలి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ నాయక్, సాలా నాగరాజు, పాండు రంగారావు, కిరణ్, యువజన అధ్యక్షుడు హనుమంతు నాయక్, సత్యనారాయణ, వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

## డివైఎఫ్ఐ నాయకుడు దారుణ హత్య

**దారుణంగా హత్య చేసిన గంజాయి ముఠాను అరెస్టు చేయాలి**
**కళాకారుడిని హతమార్చిన వారిని కఠినంగా శిక్షించాలి డివైఎఫ్ఐ**

**ఆదోని అర్బన్ పల్లె వెలుగు నవంబర్ 30**
నెల్లూరు జిల్లాలో డివైఎఫ్ఐ నాయకుడిని హతమార్చిన గంజాయి ముఠాను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డివైఎఫ్ మండల అధ్యక్షుడు శ్రీకృష్ణ, చిరంజీవి డిమాండ్ చేశారు. నెల్లూరులో డివైఎఫ్ఐ నాయకులు,ప్రజా కళాకారుడు పెంచలయ్యను హతమార్చిన ఘటనను నిరసిస్తూ ఆదోని మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ మాట్లాడుతూ నెల్లూరులో డివైఎఫ్ఎఐ నాయకులు పెంచ లయ్య నివాసం ఉండే ప్రాంతంలో యువకులను మత్తు పదార్థాలకు బానిస లుగా కాకుండా గంజాయి విక్రయిస్తున్న ముఠాను అడ్డుకునేందుకు వారిపై పోలీసులకు పిర్యాదు చేశారని, గంజాయి ముఠాపై పోరాటం చేశాడని తెలి పారు. దీనిని మనసులో పెట్టుకుని




కక్షపూరితంగా గంజాయి ముఠా ఓర్వలే నితనంతో పెంచలయ్యను కాపు కాచి హత్య చేశారని తెలిపారు. డ్రగ్స్ గంజాయి పైన డివైఎఫ్ఐ పోరాటం కొనసాగుతుందని దాడులకు భయపడేది లేదని భవిష్యత్తులో వీటిపైన మరింత తీవ్రస్థాయిలో పోరాటాలు సాగిస్తామని తెలిపారు. వెంటనే నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల నాయకులు చిరంజీవి రమేష్ ఉసేని మిగతా నాయకులు పాల్గొనడం జరిగింది.

# ప్రకృతి వ్యవసాయ విజయగాథ

## తుఫాన్‌ను తట్టుకున్న ప్రకృతి పంట

## ప్రకృతి వ్యవసాయం తో మళ్ళీ జీవం పోసుకున్న నేల తల్లి

## మొంథా తుఫాన్లో నిలిచిన ముర్తుజా బాషా ప్రకృతి సాగు శక్తి



**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో**

నంద్యాల జిల్లా, ఆత్మకూరు డివిజన్, వెలుగోడు మండలం, గుంతకందాల గ్రామానికి చెందిన 52 ఏళ్ల రైతు ముర్తుజా బాషా గారి జీవితం ప్రకృతి వ్యవసాయంతో పూర్తిగా మారిపోయింది. ఎక్కువ ఖర్చులు, తక్కువ లాభాలు, మట్టి శక్తి తగ్గిపోవడం... ఇలా ఎన్నో సమస్యలతో బెదిరిపోయిన ఆయనకు ప్రకృతి వ్యవసాయం కొత్త ఆశను ఇచ్చింది. ఇదే సమయంలో 2025లో వచ్చిన మొంథా తుఫాన్, బాషా గారి పొలానికి ఒక పెద్ద పరీక్ష. తుఫాన్ తర్వాత, ప్రకృతి వ్యవసాయం ఎంత శక్తివంతమో అందరికీ బలంగా అర్థమయ్యేలా చేసింది. ప్రకృతి వ్యవసాయానికి మార్పు ఒక్క నిర్ణయం మార్గం మార్చింది (2021) దాదాపు పదేళ్లకు పైగా బాషా రసాయన వ్యవసాయం చేశారు. ప్రతి సంవత్సరం ఎరువులు, పురుగుమందులు, కూలీ ఖర్చు పెరిగే కొద్దీ లాభాలు తగ్గిపోయాయి. నేల గట్టిపడిపోయింది, నీటిని పీల్చుకోని స్థితికి చేరింది, పురుగుల సమస్యలు తీవ్రంగా పెరిగాయి. 2019లో భారీ నష్టంతో ఆయన పూర్తిగా విసిగిపోయిన సమయంలో, ఐ సి పి ఆర్ శ్రీనివాసులు ఆయనను కలుసుకుని ప్రకృతి వ్యవసాయం వైపు వెళ్లమని ప్రోత్సహించారు. నేలను ప్రకృతి మార్గంలో ఆరోగ్యవంతం చేస్తే పంట అదే బలపడుతుందని వివరించారు. మొదట బాషా గారు కొంత భాగంలో మాత్రమే ద్రవ జీవామృతం, నీమాస్త్రం వాడుతూ ట్రయల్ చేశారు. చిన్నచిన్న మార్పులు వెంటనే కనిపించాయి పురుగులు తగ్గడం, మట్టి మెత్తగా మారడం, తక్కువ ఖర్చుతో పంట నిలబడడం మొదలయ్యాయి. అప్పుడు ఆయన నిర్ణయించుకున్నారు: “రసాయనాలు మట్టిని నాశనం చేస్తున్నాయి... మరి ఇంకో సీజన్ కూడా ఎందుకు కొనసాగించాలి?”

**2021 – ప్రకృతి వ్యవసాయానికి పూర్తి మార్పు**

2021లో బాషా రసాయనాలను పూర్తిగా ఆపి, 1 ఎకరా పొలంలో 100% ప్రకృతి సాగునే ప్రారంభించారు. మట్టిలో జీవక్రియ పెంచడానికి ద్రవ జీవామృతం, మట్టి నిర్మాణాన్ని మెరుగుపరచడానికి ఘన జీవామృతం, సహజ పురుగు నియంత్రణకు నీమాస్త్రం, మొక్క పెరుగుదలకు దశపర్ణి కషాయం వాడడం మొదలుపెట్టారు. అత్యంత ముఖ్యమైన మార్పు మాత్రం పి.ఎం.డి.ఎస్ పద్ధతి. పంట వేసేముందు 25 రకాల గింజలను పొలంలో వెదజల్లారు పప్పుధాన్యాలు, కూరగాయలు, ఆకుకూరలు, నూనెగింజలు, వేరుశనగలు, శనగలు మొదలైనవి. ఇవి మట్టికి నిరంతర జీవగుణం, తేమ నిలుపుదల, ఎరువుల్లాంటి పచ్చపదార్థం, రూట్ ఛానెల్స్ పెరుగుదల, పురుగు నియంత్రణ మరియు సూక్ష్మజీవుల పెరుగుదలను అందిస్తాయి. నెలల్లోనే మార్పు స్పష్టమైంది- మట్టి మళ్లీ జీవంతో నిండిపోయింది, పురుగులు తగ్గాయి, నీరు సులభంగా ఇంకిపోతోంది..

**“ఎరువులతో కాదు... జీవంతో సాగిస్తున్నాను” బాషా గారి సందేశం**

ముర్తుజా బాషా మాట్లాడుతూ... గతంలో నేను ఎరువులతో వ్యవసాయం చేసేవాడిని. ఇప్పుడు మట్టి జీవంతో నిండిపోయింది. ప్రకృతి వ్యవసాయం నాకు మళ్లీ నమ్మకం ఇచ్చింది” అని తెలిపారు.

**ప్రకృతి వ్యవసాయం – రైతులకు మార్గదీపం**

ముర్తుజా బాషా విజయం గ్రామంలోని ఇతర రైతులకు ఆదర్శంగా మారింది. తక్కువ ఖర్చుతో, మట్టిని బలపరిచే ప్రకృతి పద్ధతులు తీవ్ర వాతావరణ మార్పుల్లో కూడా పంటను రక్షించగలవని ఆయన నిరూపించారు.

# నారాయణ పాఠశాల ప్రీమియర్ లీగ్ ఆటల పోటీలు




**ఆదోని పల్లె వెలుగు నవంబర్ 30**

ఈరోజు నారాయణ పాఠశాలలో నిర్వహించిన నారాయణ ప్రీమియర్ లీగ్ క్రీడా పోటీలు అత్యంత ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి ఈ కార్యక్రమానిక ముఖ్య అతిథిగా ఏజీఎం రమేష్ కుమార్ అలాగే ఆదోని డివిజనల్ స్పోర్ట్స్ సెలక్షన్ కో ఆర్డినేటర్ జి. రామన్న ఆదోని మూడవ పట్టణ సి.ఐ పి.రామలింగయ్య హాజరయ్యారు మరియు అతిథులుగా ఈ చాంప్స్ జోనల్ కో ఆర్డినేటర్ ప్రియాంక మేడమ్, ఈ కిట్స్ జెడ్ సి జైబా పాల్గొన్నారు.ఏజీఎం రమేష్ కూమార్ మాట్లాడుతూ ఇలాంటి క్రీడా పోటీలు విదార్థుల్లో ఆత్మ విశ్వాసం, టీమ్ స్పిరిట్, నాయకత్వం పెంచుతాయి నారాయణ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడ ప్రతిభ ప్రదర్శించడం అభినంద నీయం అని తెలిపారు స్పోర్ట్స్ కోఆర్డినేటర్ జి. రామన్న మాట్లడతూ క్రీడలు విద్యార్థుల శారీరక మానసిక అభివృద్ధికి అత్యంత ముఖ్యమైనవి, నారాయణ పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం చాలా గొప్ప విషయం అన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ(ఎన్ పి ఎల్) మా విద్యార్థులలో క్రీడా క్రమశిక్షణ మరియు ఆరోగ్యకరమైన పోటి భావనను పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది అన్నారు. ప్రియాంక మరియు జైబా విద్యార్థులలో ఉత్సాహన్ని ప్రశంసిస్తు ఈ తరహ కార్యక్రమాలు పిల్లలలో క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తాయి. అని కొనియాడారు.కార్యక్రమంలో విద్యార్థులు వివిద క్రీడల్లో పాల్గొన్నా విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు కార్యక్రములో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయలు విద్యార్థులు మరియు వల్ల తల్లి దండ్రులు పాల్గోని కార్యక్రమాన్ని విజయ వంతం చేశారు.

# విజయవంతంగా 62వ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి మెగా వైద్య శిబిరం

## పేదలకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు

**పల్లె వెలుగు నంద్యాల రూరల్**




పేదల కోసమే కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి అన్నారు. పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి చారిటబుల్ సొసైటి ఆధ్వర్యంలో పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రజా వైద్యశాలలో నిర్వహించిన 62వ మెగా వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. కోవెలకుంట్ల తాలూకా సంజామల మండలం మంగపల్లె గ్రామంలో శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల అధినేత డాక్టర్ పి.దస్తగిరి రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఆరోగ్యాన్ని అందించేందుకే పెద్దరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతినెల వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. తన తల్లిదండ్రుల నుండి తనకు వచ్చిన 10 ఎకరాల పొలాన్ని పేదల కోసమే కేటాయించి కార్పొరేట్ స్థాయి ఆసుపత్రి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జన్మనిచ్చిన ఊరికి సేవ చేయాలన్నదే తన తండ్రి పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి లక్ష్యమని చెప్పారు. పేద ప్రజలకు డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి సేవలు అభినందనీయమనీ అన్నారు. ఇందులో కార్పొరేట్ స్థాయి ఆసుపత్రి నిర్మించి మెగా వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు ఉచితంగా వైద్యాన్ని అందిస్తున్నారని అన్నారు. ప్రతినెల చివరి ఆదివారం రోజున పేదలకు వైద్య శిబిరంతో పాటు ఉచితంగా మందులు అందిస్తూ తనకు జన్మ ఇచ్చిన తల్లిదండ్రుల రుణం తీర్చుకోవడమేనని తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో పాల్గొనే ప్రతి ఒక్కరికి తమ సొంత ఖర్చులతో ఉచితంగా భోజన వసతిని కల్పిస్తూ మంగపల్లె గ్రామంలోని ప్రజల సంక్షేమానికి పాటుపడుతున్నారని ఆయన చేస్తున్న సేవలే మాకు శ్రీరామరక్ష అన్నారు. 62వ మెగా వైద్య శిబిరంలో 1200 మంది రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు డైరెక్టర్ షేక్షావలి రెడ్డి వెల్లడించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో గుండె జబ్బులు, బిపి, షుగరు, మోకాళ్ళ నొప్పులు, కంటివ్యాదులు, ఊపిరితిత్తుల వ్యాధులు, స్త్రీలకు సంబందించిన వ్యాదులు, చెవి, ముక్కు, గొంతుకు సంబందించిన జబ్బులకు , దంతవ్యాదులు, చర్మవ్యాదులకు వైద్యసేవలు చేసి మందులను ఇస్తున్నామని తెలియజేశారు. కోవెలకుంట్ల సంజామల మండలం పరిసర ప్రాంతం ప్రజలందరూ శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేసుకున్నారు.

# రెండో విడత నామినేషన్ సెంటర్లను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకిర్త్



**భూపాలపల్లి నవంబర్ 30 పల్లె వెలుగు ప్రతినిధి:**

రెండో విడత నామినేషన్‌లో భాగంగా సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను ప్రత్యక్షంగా పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ స్థానిక సంస్థల ఎన్నికల రెండో విడత నామినేషన్ల నేపథ్యంలో భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ ఆదివారం చిట్యాల మండలంలోని చల్లగరిగే గ్రామపంచాయతీ, చిట్యాల గ్రామపంచాయతీ మరియు టేకుమట్ల మండలంలోని వెలిశాల,గర్మిళ్లపల్లి గ్రామపంచాయతీ నామినేషన్ కేంద్రాలు, పోలింగ్ స్టేషన్లను సందర్శించారు.సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించబడిన ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు,బందోబస్తు విధులు,సిబ్బంది నిర్వహణను సమీక్షించి అవసరమైన సూచనలు అందించారు.తనిఖీల సందర్భంగా మాట్లాడిన ఎస్పీ ఎన్నికల వాతావరణం, వారి అంచనాలు,పోలీస్ శాఖ నుండి ప్రజలకు అవసరమైన సేవలు వంటి అంశాలను తెలుసుకున్నారు.ప్రజలు ప్రశాంతంగా భయభ్రాంతులకు లోనుకాకుండా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా సంపూర్ణ భద్రతా వాతావరణం కల్పించడంలో పోలీస్ శాఖ కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు.నామినేషన్ కేంద్రాల్లో సిబ్బందితో మాట్లాడిన ఎస్పీ శాంతి భద్రతలను అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుని విధుల్లో నిబద్ధతతో వ్యవహరించాలని సూచించారు. మొత్తం ఎన్నికల ప్రక్రియ సాఫీగా ఏవిధమైన పరిస్థితులు తలెత్తకుండా సాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఎన్నికల కాలమంతా ప్రజా భద్రత,శాంతి సమాధానాల పరిరక్షణ కోసం జిల్లా పోలీసు శాఖ నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నది.

# గ్రామ దేవత విగ్రహా ప్రతిష్టాపనోత్సవ కరపత్రాలు విడుదల



**హొళగుంద పల్లె వెలుగు నవంబర్ 30**

మండలంలోని గజ్జహల్లి గ్రామంలో శ్రీ దేవమ్మ దేవి విగ్రహ ప్రతిష్టాపనోత్సవ కరపత్రాలను ఆదివారం గ్రామ దేవమ్మ దేవి భక్త బృందం ఆధ్వర్యంలో విడుదల చేశారు. విగ్రహ ప్రతిష్టాపనోత్సవ కార్యక్రమాలు ఫిబ్రవరి 18 నుండి ఫిబ్రవరి 20 వరకు జరుగునున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు శ్రీ గురు గణపతి పూజ, దేవి నంది, పుణ్యవచనం, వాస్తు, సుదర్శన, నవగ్రహ, హెూమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు , రెండవ రోజు శ్రీ గణపతి పూజ, దుర్గ హెూమం, శ్రీ దేవమ్మ దేవి విగ్రహ ఊరేగింపు, పసుపు, కుంకుమ గుడి నింపు కార్యక్రమం, మరియు జలధివాస, క్షీరాధివాస, ధ్యానాదివాస, సయ్యదివాస శ్రీ సయ్యదివాస, శ్రీదేవి దీపోత్సవం, హెూమాలు. మూడవరోజు మధ్యాహ్నం 12-10 గంటలకు వృషభలగ్న విగ్రహానికి పంచామృతాభిషేకం నిర్వహించి శ్రీ దేవమ్మ దేవి విగ్రహాన్ని ప్రతిష్టించి మహా మంగళహారతి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలతో పాటు ఆలయ దర్శనానికి విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్వహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆరుభట్ల నాగమ్మ, జంగం నాగరాజు స్వామి, పోరిడి శంభులింగ, దాసరి రాము, కొత్తింటి వెంకటేష్, చాకలి రామ, బజారి దస్తగిరి, డబ్బా దస్తగిరి, దాసరి గోపాల్, కంబారి బసప్ప, కంబారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కారుణ్య నియామకాలు చేపట్టాలి


## నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ డివిజన్ అధ్యక్షులు సుమాల చార్లెస్





**ఎమ్మిగనూరు పల్లె వెలుగు నవంబర్ 30**

మున్సిపాలిటీలో పనిచేస్తూ మరణించిన 13 మంది పారిశుద్ధ కార్మిక కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద అవుట్సోర్సింగ్ ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ సిపిఐ పట్టణ కార్యదర్శి రంగన్న, ఏఐటీయూసీ నాయకులు తిమ్మ గురుడు, ఐఎఫ్టియు నాయకులు ప్రసాద్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షలకు సంఘీభావంగా మద్దతు తెలపడానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ డివిజన్ అధ్యక్షులు, మండల కార్యదర్శి ఏసురాజు. అయితే ఈ దీక్షను ఉద్దేశించి నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ డివిజన్ అధ్యక్షులు సుమాల చార్లెస్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుండి 2025 నవంబర్ వరకు అనగా నేటి వరకు ఎమ్మిగనూర్ మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ కార్మికులు ఎవరైతే చనిపోయారో వాళ్ల కుటుంబాలలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. అధికారులు కారుణ్య నియామకాలు చేపట్టడంలో నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అలాగే గత 12 రోజుల నుండి నిరాహార దీక్షలకు పూనుకున్న పారిశుద్ధ కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని తక్షణమే కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కారుణ్య నియామకాలు చేపట్టడంలో ఉన్నత అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. కాబట్టి అధికారులు తక్షణమే స్పందించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు గత 12 రోజుల నుండి ఎమ్మిగనూరులో మున్సిపాలిటీ పారిశుద్ధ కార్మిక కుటుంబాలు రిలే నిరాహార దీక్షకు నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ డివిజన్ అధ్యక్షులు సుమాల చార్లెస్ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి యేసురాజు మరియు ప్రసన్న కుమార్ కలగట్ల గ్రామ నాయకులు ఏసన్న మరియు ఈరన్న, భాస్కర్, చిన్నమరియు తదితరులు పాల్గొన్నారు,

# పెద్ద తుంబలం గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలి





### కర్నూలు జిల్లా కలెక్టర్కు వినతి పత్రం అందించిన పెద్ద తుంబలం మండల జాయింట్ యాక్షన్ కమిటీ.

**పెద్ద తుంబలం గ్రామాన్ని కొత్త మండల కేంద్రంగా ప్రకటించమని వినతి**

**-తగిన చర్యలు తీసుకోవాలని అభ్యర్థన చేసిన పెద్ద తుమ్మల మండలం జాయింట్ యాక్షన్ కమిటీ.**

**ఆదోని పల్లె వెలుగు నవంబర్ 30**

ఆదోని మండలానికి చెందిన పెద్ద తుంబలం గ్రామ ప్రజల తరపున ఈ వినతి పత్రాన్ని సమర్పిస్తున్నాము. పరిపాలనా సౌలభ్యం, మరియు ప్రజావసరాల దృష్ట్యా మా గ్రామాన్ని నూతన మండల కేంద్రంగా ప్రకటించడానికి అన్ని అర్హతలు ఉన్నాయని మనవి చేసుకుంటున్నాము.

### 1.మండలంగా అర్హతలకు గల కారణాలు.

మా గ్రామం మండలం ఏర్పాటుకు కావలసిన కింది ముఖ్యమైన అర్హతలను కలిగి ఉంది.

జనాభా: 2011 జనగణన ప్రకారం పెద్ద తుంబలం జనాభా 8,886. దీనికి తోడు పరిసర గ్రామాలతో కలిపి మండల ఏర్పాటుకు అవసరమైన కనీస జనాభా (సుమారు 30,000-40,000) సులభంగా చేరుకునే అవకాశం ఉంది.

కేంద్ర స్థానం (భౌగోళిక దూరం): ప్రస్తుత మండల కేంద్రమైన ఆదోని నుండి మా గ్రామం సుమారు 20 కి.మీ. దూరంలో ఉంది. రవాణా సౌకర్యాలు సరిగా లేని మారుమూల గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి చేరుకోవడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు.

మౌలిక వసతులు: తుంగభద్ర ఎల్ ఎల్ సి కాలువ, ప్రధాన మంచినీటి చెరువులు మూడు ఉన్నాయి, విద్యా సంస్థలు (జూనియర్ కళాశాల, మాధ్యమిక పాఠశాలలు), బ్యాంకులు, ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం, సబ్ పోస్టాఫీసు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, స్థానిక పోలీస్ స్టేషన్ ,మూడు పెట్రోల్ బంకులు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయి.

చారిత్రక నేపథ్యం: పెద్ద తుంబలంలో 12వ శతాబ్దపు సుప్రసిద్ధ శ్రీరామ దేవాలయం (నక్షత్ర ఆకారంలో) ఉంది, ప్రసిద్ధ జైన్ దేవాలయం, అలాగే చారిత్రక కట్టడాలు, ఇది ఈ ప్రాంతంలో గ్రామానికి ప్రత్యేక గుర్తింపునిస్తుంది.

గ్రామాల సమీప్యం: పెద్ద తుంబలం చుట్టూ ఉన్న అనేక చిన్న గ్రామాలు (ఉదా: బల్లేకల్లు,గణేకల్ కుప్పగల్ పాండవగల్, జాలిమంచి, దొడ్డనకేరి, చిన్నతుంబలం గావిగట్టు హులికన్వి, బసలేదొడ్డి, బాపులదొడ్డి , మాంత్రికి ,కొత్తూరు, కడితోట, జి హొసల్లి,) పరిపాలనా అవసరాల కోసం ఆదోని కంటే పెద్ద తుంబలానికి చేరుకోవడం సులువుగా ఉంటుంది.

### 2.మండల ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలు.

సులభ పరిపాలన: ప్రజలు తమ ప్రభుత్వ కార్యాలయ పనుల కోసం ఎక్కువ దూరం ప్రయాణించాల్సిన అవసరం తప్పుతుంది.

అభివృద్ధి: మండల కేంద్రంగా మారితే, ఈ ప్రాంతంలో విద్య, వైద్యం, రవాణా మరియు ఆర్థిక పరమైన మౌలిక వసతులు మెరుగుపడతాయి.

ప్రజల ఆకాంక్ష ఈ ప్రాంత ప్రజలంతా తమ గ్రామాన్ని మండల కేంద్రంగా చూడాలని బలంగా కోరుకుంటున్నారు.కావున, పెద్ద తుంబలం గ్రామం యొక్క జనాభా, భౌగోళిక స్థానం, మౌలిక వసతులు, మరియు ప్రజల ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకుని, మా గ్రామాన్ని వెంటనే నూతన మండల కేంద్రంగా ప్రకటించి, ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరికను తీర్చవలసిందిగా పెద్ద తుంబలం గ్రామ ప్రజలందరి తరపున తమరిని సవినయంగా వేడుకుంటున్నాము.

# మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు.

### ఎస్సై ఎన్.రామ్మోహన్ రెడ్డి.





**మహానంది, పల్లె వెలుగు**

మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మహానంది ఎస్ఐ ఎన్. రామ్మోహన్ రెడ్డి హెచ్చరించారు.ఆదివారం రాత్రి మహానంది మండల పరిధిలోని ఆంజనేయపురం చెక్పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ముగ్గురికి జరిమానాలు విధించారని తెలిపారు. అదేవిధంగా సరైన ధ్రువపత్రాలు, హెల్మెట్ లేని పలువురికి జరిమానాలను కూడా విధించామన్నారు.మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలన్నారు.వాహన దారులు తప్పకుండా హెల్మెట్ ధరించి, వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు, లైసెన్సులు కలిగి ఉండాలని,ఫోర్ వీల్ వాహనదారులు సీటు బెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలని, లేని యెడల జరిమానాలు విధిస్తామని తెలిపారు.మహానంది పోలీస్ సిబ్బంది శేఖర్, వెంకటేశ్వర్లు, జనార్ధన్, నారాయణస్వామి, లక్ష్మణ్ పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ లక్ష్యం

### శాంతి నగర్ ఎమ్మెల్యే ఎన్.ఎ హరీష్..

**మహానంది, పల్లె వెలుగు**

ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని కర్ణాటక రాష్ట్రం శాంతి నగర్ ఎమ్మెల్యే ఎన్.ఎ హరీష్ పేర్కొన్నారు. ఆదివారం మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ కార్యక్రమం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీ నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈసిసి అబ్జర్వర్ హారిస్, పిసిసి జనరల్ సెక్రెటరీ సుధాకర్ రెడ్డి, జాతీయ కార్యదర్శి నాగ మధు యాదవ్, కేకే. చైర్మన్ శ్రీనివాసరెడ్డి, శ్రీశైలం ఇన్చార్జి ఇస్మాయిల్, ఆళ్లగడ్డ హుస్సేన్ భాష, మండల అధ్యక్షుడు షంషీర్ బాషా,నాగాచంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

# దిత్వా తుఫాను హెచ్చరిక

### ఒంటిమిట్ట మండలంలో ప్రజల ప్రముఖంగా ఉండండి ఎంపీడీవో సుజాత



**ఒంటిమిట్ట నవంబర్ 30 పల్లె వెలుగు ప్రతినిధి:**

ఒంటిమిట్ట మండల పరిధిలో వాతావరణ మార్పులు, బలమైన గాలులు, భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ఎంపీడీవో సుజాత ఆధ్వర్యంలో ముంపు గ్రామాలలో నరసన్నగారి పల్లి, పెన్నా పేరూరు, గంగ పేరూరు, చిన్న కొత్తపల్లి, రాచగుడిపల్లి గ్రామాలలో క్షేత్రస్థాయిలో పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలందరూ అప్రమత్తంగా ఉండండి, మరియు ప్రజలకు కొన్ని సూచనలు చేశారు, ఈ పర్యటనలో ఈ ఓ పి ఆర్ డి శ్రీలత, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మి, చెరువు చైర్మన్ కే. వెంకటరమణ, టిడిపి సీనియర్ నాయకులు కే. బొబ్బిలి రాయుడు పాల్గొన్నారు.



## మహానందీశ్వరుని సేవలో ప్రముఖులు

మహానంది, పల్లె వెలుగు

మహానంది పుణ్యక్షేత్రంలో ఆదివారం విజయవాడ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి రమణారెడ్డి, తెలంగాణ రాష్ట్రం సైబరాబాద్ జాయింట్ సీపీ గజపతి భూపాల్ దంపతులు పూజలు నిర్వహించారు. వీరికి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి అమ్మవార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. పూజల అనంతరం పేద పండితులు వేద ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

## జాతీయస్థాయి కరాటే పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ.



వెల్దండ నవంబర్ 30 పల్లె వెలుగు దినపత్రిక:
జాతీయస్థాయి కరాటే పోటీల్లో వెల్దండ మండల మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆదివారం జడ్చర్లలో 23 వ జాతీయస్థాయి కరాటే టోర్నమెంట్ జరిగింది. ఈ టోర్నమెంట్ పోటీలకు వివిధ పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీలో వెల్దండ మండల మోడల్ స్కూల్ విద్యార్థులు కరాటేలో ఉత్తమ ప్రతిభ కనబరిచారని కరాటే మాస్టర్ చందు తెలిపారు. ఈ పోటీల్లో పావని, వైష్ణవి, ప్రేమ్ కుమార్, శశాంక్, శేఖర్, త్రిలోచన్, కార్తీక్ గోల్డ్ మెడల్స్ , అరవింద్, లక్ష్మణ్, శివ ,అభిషేక్, రాము సిల్వర్ మెడల్స్ సాధించి మోడల్ స్కూల్ విద్యార్థులు తమ సత్తా చాటారని కరాటే మాస్టర్ చందు అన్నారు.

# శ్రీశైలం ఆన్‌లైన్ సేవలు



శ్రీశైలం. నవంబరు 30 . (పల్లె వెలుగు ):
శ్రీశైలంలో దేవస్థానం అందిస్తున్న ఆన్‌లైన్ సేవలను భక్తులు విరివిగా వినియోగించుకోవాలని కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు భక్తులకు సూచించారు. అన్నీ ఆర్జితసేవలను మరియు శ్రీస్వామివారి స్పర్శదర్శన టిక్కెట్లను ఆన్‌లైన్ ద్వారా పొందే అవకాశం ఉందన్నారు.శ్రీస్వామివారి ఆర్జిత గర్భాలయ అభిషేకం, ఆర్జిత సామూహిక అభిషేకం, కుంకుమార్చన, గణపతిహెూమం, రుద్రహెూమం,మహామృత్యుంజయహెూమం, చండీహెూమం, కల్యాణోత్సవం, అన్నప్రాశన, అక్షరాభ్యాసం మొదలైన 17 ఆర్జితసేవలకు సంబంధించిన సేవాటిక్కెట్లను ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చునని తెలియజేశారు.అదేవిధంగా వసతిని కూడా ముందస్తుగా ఆన్‌లైన్‌లో రిజర్వు చేసుకునే అవకాశం కల్పించబడిందన్నారు.ఇందుకోసం భక్తులు రాష్ట్ర దేవదాయశాఖ అధికారిక వెబ్‌సైట్ www.aptemples.ap.gov.inలేదా దేవస్థానం అధికారిక వెబ్‌సైట్ www.srisailadevasthanam.orgలను మాత్రమే వినియోగించు కోవాలన్నారు 'మనమిత్ర'వాట్సాప్ ద్వారా కూడా శ్రీస్వామి వారి స్పర్శదర్శనం, శీఘ్రదర్శనం, అతిశీఘ్రదర్శనం టికెట్లను మరియు ఆర్జితసేవాటిక్కెట్లను పొందవచ్చు నని అన్నారు. అయితే రూ. 150/-ల రుసుముతో గల శీఘ్రదర్శనం మరియు రూ. 300/-ల రుసుముతో గల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లను మాత్రం ఆన్‌లైన్‌తో పాటు కరెంట్ బుకింగ్ ద్వారా కూడా పొందవచ్చునని అన్నారు. ఈ టికెట్లలో 30శాతం టికెట్లు ఆన్‌లైన్‌లో ఇవ్వబడగా, తక్కిన 70 శాతం టికెట్లు కరెంట్ బుకింగ్ ద్వారా ఇవ్వబడుతున్నాయి.

టిక్కెట్ల లభ్యతను బట్టి ప్రారంభ సమయానికంటే ఒక గంట ముందు వరకు కూడా భక్తులు ఆన్‌లైన్‌లో టికెట్లను పొందే అవకాశం కల్పించబడిందన్నారు.కాగా ఆర్జితసేవా కర్తలు మరియు స్పర్శదర్శనం టిక్కెట్ పొందిన వారు విధిగా ఆన్‌లైన్ ద్వారా పొందిన టిక్కెట్ ప్రింట్ కాపీని (హార్డ్ కాపీని) మరియు ఆధార్‌కార్డు నకలును తమవెంట తెచ్చుకోవలసివుంటుంది.ఆన్‌లైన్ ద్వారా పొందిన ఆయా టిక్కెట్లను స్కానింగ్ జరిపిన తదుపరి మాత్రమే ఆర్జితసేవాకర్తలను మరియు స్పర్శదర్శనం టిక్కెట్లు పొందిన వారిని అనుమతించడం జరుగుతుంది. భక్తులు టిక్కెట్టు / ప్రింటు కాపీని మరియు ఆధార్ కార్డ్ ప్రతిని ఒరిజినల్ ఆధార్ కార్డు తప్పనిసరిగా తెచ్చుకోవలసి ఉంటుంద న్నారు.కాగా సామాన్య భక్తుల సర్వదర్శనానికి ఇబ్బందులు లేకుండా ఉండేందుకుగాను అర్జితసేవలు నిర్దిష్టవేళలలో జరిపించబడుతున్నాయన్నారు. అదేవిధంగా శ్రీ స్వామివారి స్పర్శదర్శనం కూడా నిర్దిష్ట వేళల్లోనే కల్పించబడుతుంది.కాబట్టి ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్లు పొందిన ఆర్జితసేవాకర్తలకు టిక్కెట్ పై సూచించిన సమయములో మాత్రమే ఆయా ఆర్జితసేవలు జరిపించబడుతాయని పేర్కొన్నారు. సేవాకర్తలు వారిసేవా సమయం కంటే కనీసం 15 నిమిషాలు ముందుగా ఆర్జితసేవా క్యూలైన్ ప్రవేశద్వారం వద్ద రిపోర్టు చేయవలసి వుంటుందన్నారు.అదేవిధంగా స్పర్శదర్శనం టిక్కెట్ పొందిన భక్తులకు కూడా టిక్కెట్టుపై పొందుపర్చ బడిన సమయములో మాత్రమే స్పర్శదర్శనం కల్పించబడుతుందన్నారు.భక్తులందరు కూడా దేవస్థానం అందిస్తున్న ఆన్‌లైన్ సేవలను వీలైనంత ఎక్కువగా వినియోగించుకోవాలని కార్యనిర్వహణాధికారి భక్తులకు సూచించారు.







## శ్రీశైలంలో పల్లకీ ఉత్సవం

శ్రీశైలం. నవంబరు 30 . (పల్లె వెలుగు ):
శ్రీశైలంలో లోకకల్యాణంకోసం దేవస్థానం ఈ ఆదివారం రాత్రి శ్రీ స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవం నిర్వహించారు.ఈ పల్లకీ ఉత్సవం ప్రతి ఆదివారం, పౌర్ణమి మరియు మూలా నక్షత్రం రోజులలో దేవస్థాన సేవగా (సర్కారి సేవగా) జరిపించబడుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా అమ్మవారి ఆలయ ఆశీర్వచన మండపంలో లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవాసంకల్పాన్ని పఠిస్తారు.తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించబడుతుంది.అనంతరం శ్రీ స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో వేంచేబు చేయించి శాస్త్రోక్తంగా షోడశోపచారపూజలు జరిపించబడుతాయి.









## చాగలమర్రిలో ఘనంగా అయ్యప్ప విళ్ళక్కి (పడి) పూజ

హెూమాలు నిర్వహిస్తున్న అయ్యప్ప స్వాములు..... చిన్నారులతో దీపోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

చాగలమర్రి . పల్లె వెలుగు బీ నంద్యాల జిల్లా
చాగలమర్రి పట్టణంలోని ఏకశిల పదనెట్టాంబడి అయ్యప్ప స్వామీ ఆలయంలో పడి పూజ ఆదివారం నిర్వహించారు. గురుస్వాముల ఆధ్వర్యంలో తెల్లవారుఝామునుండే అభిషేకాలు,ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులచే దీపాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అయ్యప్ప విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పడిపూజ నిర్వహించారు.18మెట్లను అలంకరించి దీపాలు వెలిగించారు. మాలధారుల అయ్యప్పనామ స్మర ణ, సంకీర్తనతో ప్రాంతం మార్మోగింది. అనంతరం హారతులు పట్టి
మెట్లకు అయ్యప్ప మాలధారులు పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యములో పలు ప్రాంతాల గురు స్వాములకు శాలువ కప్పి సత్కరించారు.శ్రీ అయ్యప్ప స్వామి సేవా సమాజం ఆధ్వర్యములో అన్న ప్రసాద వితరణ చేసారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎస్ఐ సురేష్ ప్రత్యేక పోలీసు బృందాలతో బందోబస్తు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సుంకు జనార్ధన్ రావు , కార్యదర్శి మదళ్ళపల్లె లక్ష్మీనారాయణ , కమిటీ సభ్యులు , గురు స్వాములు జయదేవరెడ్డి , రాయుడు స్వామి , వందవాసి నాగేశ్వర రావు , వందవాసి మహేష్ , భక్తులు , తదితరులు పాల్గొన్నారు.



# స్థానిక ఎన్నికలకు సమాయత్తం కావాలి

### సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కరరావు.

**చారకొండ నవంబర్ 30 పల్లె వెలుగు దినపత్రిక:**
మూడో విడతలో జరిగే సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు భారత రాష్ట్ర సమితి శ్రేణులు సమయాత్తం కావాలని ఆ పార్టీ నేత వెల్దండ ఉమ్మడి మండల సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కరరావు పిలుపునిచ్చారు. ఆదివారం చారగొండ మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ విజయేందర్ గౌడ్ అధ్యక్షతన పార్టీ మండల కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 17 నుంచి మండలంలో జరిగే సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ప్రజాబలం ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో అభ్యర్థులు విజయం సాధించాలని సూచించారు. ప్రజా వ్యతిరేక విధానాలను ఆలంబిస్తున్న ప్రభుత్వ తీరును ఎప్పటికప్పుడు ఎండగడుతూ ముందుకు సాగాలన్నారు. పిఎసిఎస్ చైర్మన్ యాదయ్య గౌడ్, మాజీ సర్పంచులు శ్రీనివాస్, సాయి కుమార్, శ్రీను గౌడ్, సలీం, యాదగిరి గౌడ్, కమలాకర్ రావు, బొజ్జయ్య, జగపతి తదితరులు పాల్గొన్నారు.

# రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు.

### వెల్దండ ఎస్సై కురుమూర్తి



**వెల్దండ నవంబర్ 30 పల్లె వెలుగు దినపత్రిక:**
స్థానిక ఎన్నికల నేపథ్యంలో.. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు లేదా వ్యాఖ్యలు పెట్టిన వ్యక్తులపై కఠినమైన చర్యలు తప్పవని వెల్దండ ఎస్సై కురుమూర్తి హెచ్చరించారు. ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఇతరుల మనోభావాలను దెబ్బ తీసేలా సోషల్ మీడియాలో ప్రసారం చేసినా కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. సోషల్ మీడియా ద్వారా హానికరమైన ఉద్రిక్తతలకు దారి తీసే పోస్టులు షేర్ చేసిన కూడా బాధ్యులపై చర్యలు తప్పవని , గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించే వారిపై కూడా సంబంధిత శాఖ ద్వారా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరికీ నమస్కారం..

**బద్వేల్ నవంబర్ 30 (పల్లె వెలుగు)**



తెలుగుదేశం పార్టీ మునిసిపల్, మండల, క్లస్టర్, యూనిట్, బూత్ స్థాయి నాయకులు కార్యకర్తలు అందరికీ ముఖ్య గమనిక:కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను లబ్ధిదారులకు పంపిణీ చేసే విషయంలో ప్రతి ఒక్కరు పాల్గొని ఆయా ప్రభుత్వ సంక్షేమ ఫలాలను లబ్ధిదారులకు అందించే విధంగా చూడాలని ప్రతి ఒక్కరిని కోరుచున్నాను. గౌరవ ముఖ్యమంత్రి వర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశాల మేరకు ప్రతి నెల 1 వ తేదీన వృద్ధులు, వితంతువులు, వికలాంగులు మొదలైన అన్ని రకాల పింఛన్ లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ కార్యక్రమంలో బద్వేల్ నియోజకవర్గంలో ప్రతి ఒక్క తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుడు వారి వారి పరిధిలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు అందరిని పేరుపేరునా కోరుచున్నాను.

# మాజీ నక్సలైట్ సర్పంచ్‌గా ఏకగ్రీవం

### ముఖ్యమంత్రి స్వగ్రామం కొండారెడ్డిపల్లి సర్పంచ్ గా వెంకటయ్య ఏకగ్రీవం ముఖ్యమంత్రి స్వగ్రామంలో దళితుడు సర్పంచ్ గా ఏకగ్రీవం ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన మాజీ దళ కమాండర్










**నాగర్ కర్నూల్ నవంబర్ 30.( పల్లె వెలుగు)**
రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్వగ్రామం నాగర్ కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లి లో సర్పంచ్ పదవికి మాజీ నక్సలైట్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పై కల్వకుర్తి మాజీ దళ కమాండర్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎత్తం కృష్ణయ్య హర్షం వ్యక్తం చేశారు. కొండారెడ్డిపల్లి గ్రామానికి ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ వెంకటయ్య గతంలో కల్వకుర్తి) దళంలో నక్సలైట్ గా పనిచేసి లొంగిపోవడం జరిగింది.. దళిత కుటుంబానికి చెందిన వెంకటయ్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో స్వగ్రామానికి సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నుకోవడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అప్పటి కల్వకుర్తి దళ కమాండర్ ఎత్తం కృష్ణయ్య అలియాస్ జనార్ధన్ ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ముఖ్యమంత్రి మాజీ నక్సలైట్ల పట్ల ఉదార స్వభావం చూపుతూ, వారికి ప్రభుత్వ పరంగా ఉపాధి అవకాశాలు కల్పించి, ఆర్థికంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏకగ్రీవంగా సర్పంచ్ గా ఎన్నికైన వెంకటయ్య, ఎత్తం కృష్ణయ్య కు శిష్యుడు కావడం విశేషం పేద బడుగు బలహీన వర్గాల ప్రజల కష్టాలు నష్టాలు తెలిసిన వ్యక్తిగా దళిత కుటుంబంలో జన్మించిన వెంకటయ్య ముఖ్యమంత్రి స్వగ్రామంలో సర్పంచిగా ప్రజలకు విశిష్ట సేవలందించి రాబోయే రోజుల్లో మరెన్నో పదవులు పొందాలని ఈ సందర్భంగా ఎత్తం కృష్ణయ్య ఆకాంక్షించారు.

# ఇస్కాన్ ఆధ్వర్యంలో గీతా జయంతి & ఏకాదశి ఉత్సవాలు...



సిరివెళ్ల(పల్లె వెలుగు) 01:12:2025 సిరివెళ్ల మండలం వెంకటాపురం గ్రామంలో NH-44 నందు గల సీత రామాలయ మందిరం వద్దగల ...హరే కృష్ణ నామ -హట్ట నందు డిసెంబర్1న గీతా జయంతి మరియు మోక్షద ఏకాదశి ఉత్సవాలు ఇస్కాన్ ప్రధాన కేంద్రం నుండి శ్రీమాన్ హెచ్ జి గోపికాంత్ కృష్ణ దాస్ ప్రభుజి & కాలింది గోపి కాంత్ ప్రియదాసి మాతాజీ వారి ఆధ్వర్యంలో గీతా జయంతి వేడుకలు మోక్షద ఏకాదశి వేడుకలు నిర్వహించబడును ఈ హరే కృష్ణ నామ -హట్ట శిరివెళ్ల మండలం వెంకటాపురం గ్రామం లో మండల స్థాయి ఆధ్యాత్మిక కేంద్రం గా ఈ సంస్థను ఏర్పాటు చేశారు ఇస్కాన్ అనగా అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘము ఈ కృష్ణ చైతన్య సంఘం ను ఏసీ భక్తి వేదాంత స్వామి ప్రభుపాదులు స్థాపించారు వీధి గురువుగారు శ్రీల భక్తి సిద్ధాంత సరస్వతి వీరి ఆదేశాల తో ప్రభుపాదుల వారు అమెరికా వెళ్లి అనేక దేశాలలో ఇస్కాన్ సంస్థను విస్తరింపజేశారు వీరికి ఐక్యరాజ్యసమితిలో విశ్వ గురువు అనే బిరుదును బహుకరించారు శ్రీల ప్రభుపాదుల వారు భారతదేశంలోని కలకత్తా నగరంలో 1896 సంవత్సరంలో జన్మించారు వీరు 64 గోడియా మఠాలను స్థాపించారు మీరు భగవద్గీత భాష్యమును రచించినారు అమెరికా వెళ్లి ఈ కృష్ణ చైతన్య సంఘం ను ప్రపంచవ్యాప్తంగా విస్తరింపజేశారు తరువాత 20 కి పైగా గ్రంధాలను రచించారని హెచ్ జి గోపి కాంత్ కృష్ణ దాస్ ప్రభుజి తెలిపారు. కృష్ణ చైతన్యాన్ని గ్రామ గ్రామాన వీధి వీధిలో విస్తరింప జేయాలని వారు పిలుపునిచ్చారు.

గీతా జయంతివేడుకలు ప్రపంచవ్యాప్తంగా అందరు నిర్వహించాలని తెలియజేశారు
వివరాలకు సంప్రదించండి.
1రాజేశ్వరి మాతాజీ .9346227465
2.మహేష్ ప్రభుజీ
9885557674, ఫోన్ నెంబర్.



# ఏపీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ చేపట్టాలి

**లావు శ్రీకృష్ణ దేవరాయలు**

**ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ చేపట్టాలని ఈసీని కోరిన టీడీపీ**

**ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం అనంతరం లావు శ్రీకృష్ణ దేవరాయలు వెల్లడి**

**ఇతర రాష్ట్రాల్లో ఈసీ చేపట్టిన సవరణను స్వాగతిస్తున్నామని వెల్లడి**

ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని వెంటనే చేపట్టాలని తెలుగుదేశం పార్టీ విజ్ఞప్తి చేసింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఎన్నికల సంఘం ఇప్పటికే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడాన్ని స్వాగతిస్తున్నామని, ఇదే తరహాలో ఏపీలోనూ ఓటర్ల జాబితాను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణ దేవరాయలు స్పష్టం చేశారు. సోమవారం నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరగనున్న నేపథ్యంలో, ఆదివారం ఢిల్లీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు సహకరించాలని ఈ సమావేశంలో ప్రభుత్వం అన్ని పార్టీలను కోరింది. అయితే, ఇదే సమావేశంలో ప్రతిపక్షాలు ఓటర్ల జాబితా సవరణపై ఉన్న ఆందోళనలపై పార్లమెంటులో చర్చ జరగాలని పట్టుబట్టాయి. ఈ నేపథ్యంలో ఎన్డీయే మిత్రపక్షమైన తెలుగుదేశం పార్టీ తరఫున లావు శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ.. ఏపీలో ఓటర్ల జాబితా సవరణ ఆవశ్యకతను నొక్కిచెప్పారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, అఖిలపక్ష సమావేశంలో తాము పలు కీలక అంశాలను లేవనెత్తినట్లు తెలిపారు. ముఖ్యంగా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా నదీ జలాల పంపిణీ అంశంపై ఈ సమావేశాల్లో సమగ్ర చర్చ జరగాలని కోరినట్లు వివరించారు. ఈ వివాదం ఎన్నో ఏళ్లుగా కొనసాగుతోందని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. అలాగే, కేంద్ర ప్రభుత్వ పథకమైన జల్ జీవన్ మిషన్ గురించి కూడా ప్రస్తావించినట్లు శ్రీకృష్ణ దేవరాయలు తెలిపారు. ఈ పథకం అమలు విధానం, దాని ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు చేకూరే ప్రయోజనాలపై స్పష్టత కోసం పార్లమెంటులో చర్చ జరపాలని కోరినట్లు చెప్పారు. దీనివల్ల పథకం అమలులో పారదర్శకత వస్తుందని, రాష్ట్రానికి దక్కాల్సిన ప్రయోజనాలు పూర్తిగా అందుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

ఇదిలా ఉండగా, ఓటర్ల జాబితాలో పేర్లను సరిచూసుకునేందుకు వీలుగా 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో %ా×=% షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం మరో వారం పాటు పొడిగించింది. రాబోయే ఎన్నికల నాటికి ఓటర్ల జాబితాలను మరింత కచ్చితంగా, సమగ్రంగా తీర్చిదిద్దేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. అండమాన్ నికోబార్ దీవులు, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, లక్షద్వీప్, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోంది.

తాజా షెడ్యూల్ ప్రకారం, గణన ప్రక్రియను డిసెంబర్ 11 వరకు పొడిగించారు. ముసాయిదా ఓటర్ల జాబితాను డిసెంబర్ 16న ప్రచురించి, 2026 జనవరి 15 వరకు అభ్యంతరాలు, చేర్పులకు అవకాశం కల్పిస్తారు. తదుపరి దశలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా ఈ ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని చేపట్టే అవకాశం ఉంది.

# ఏపీ హక్కుల కోసం పార్లమెంటులో పోరాడాలని వైసీపీ ఎంపీలకు జగన్ పిలుపు

- రేపటి నుంచి పార్లమెంటు శీతాకాల సమావేశాలు
- రైతుల సమస్యలపై పార్లమెంటులో గట్టిగా పోరాడాలని ఎంపీలకు జగన్ సూచన
- తుపాను నష్టపరిహారం, కనీస మద్దతు ధర కోసం పట్టుబట్టాలని ఆదేశం
- విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపు
- ఉపాధి హామీ కార్డుల తొలగింపు, శాంతిభద్రతల క్షీణతపై గళమెత్తాలని దిశానిర్దేశం



రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభంతో పాటు, ఆంధ్రప్రదేశ్ హక్కుల సాధన కోసం పార్లమెంటులో గట్టిగా పోరాడాలని వైసీపీ అధినేత జగన్ పార్టీ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. సోమవారం నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న అనుసరించాల్సిన వ్యూహంపై ఆయన తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఎంపీలతో సమావేశమయ్యారు. తుఫాను నష్టంతో పాటు, పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్ పీ) లభించకపోవడంతో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, ఈ అంశాలపైనే ప్రధానంగా దృష్టి సారించాలని ఆయన స్పష్టం చేశారు. 'మొంథా' తుపాను కారణంగా కోస్తా జిల్లాల్లో లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, సర్వం కోల్పోయిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవడంలో విఫలమయ్యాయని జగన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో తమ ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా నేరుగా పంటలను కొనుగోలు చేసి మద్దతు ధర కల్పించిందని, ఇప్పుడు ఆ వ్యవస్థను నిర్వీర్యం చేయడంతో రైతులు దళారుల చేతుల్లో నలిగిపోతున్నారని ఆవేదన చెందారు. వరి, మొక్కజొన్న, మినుములు, పత్తి, కంది, అరటి, మిర్చి, మామిడి వంటి అన్ని ప్రధాన పంటలకు మద్దతు ధర పడిపోయిందని, దీనివల్ల రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని తెలిపారు. పార్లమెంటులో ఈ అంశాన్ని ప్రస్తావించి, రైతులకు తక్షణమే అత్యవసర సహాయ నిధులతో పాటు, మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించేలా ఒత్తిడి తీసుకురావాలని ఆదేశించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు ప్రీమియం భారం లేకుండా ఉచిత పంటల బీమా అందించామని, ఇప్పుడు ఆ పథకాన్ని నిలిపివేయడంతో ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని జగన్ విమర్శించారు. ఇన్‌పుట్ సబ్సిడీ కూడా అందడం లేదని, ఈ-క్రాప్ నమోదును నిలిపివేయడంతో పరిహారం పొందేందుకు కూడా రైతులు అనర్హులుగా మారుతున్నారని అన్నారు. మిర్చి రైతులకు ఆర్థిక సాయం చేస్తామని చెప్పి మోసం చేశారని, మామిడి రైతులను కూడా ప్రభుత్వం గాలికొదిలేసిందని ఆరోపించారు. ఇదే సమయంలో, రాష్ట్రవ్యాప్తంగా 18.63 లక్షలతో సహా మొత్తం లక్షల ఉపాధి హామీ జాబ్ కార్డులను రద్దు చేయడంపై జగన్ మండిపడ్డారు. దీనివల్ల గ్రామీణ కుటుంబాలు జీవనోపాధి కోల్పోతున్నాయని, వెంటనే అర్హులైన వారి కార్డులను పునరుద్ధరించి, పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేయాలని ఎంపీలకు సూచించారు. విశాఖ స్టీల్ ప్లాంటును ముక్కలు చేసి ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ప్లాంటుకు సొంత గనులు కేటాయించి, వేలాది మంది కార్మికుల జీవితాలను కాపాడాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, రాజకీయ కక్ష సాధింపులు పెరిగిపోయాయని, ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయని ఆరోపించారు. రాష్ట్రానికి రావలసిన నిధులు, ఉపాధి కల్పన, హక్కుల పరిరక్షణ కోసం పార్లమెంటు వేదికగా గట్టిగా పోరాడాలని జగన్ తన ఎంపీలకు స్పష్టం చేశారు.

# గుంటూరు జీజీహెచ్‌లో హైటెన్షన్..

**రోగిలా వచ్చిన ఆరోగ్య కార్యదర్శి!**

**సాధారణ రోగిలా గుంటూరు జీజీహెచ్‌కు వెళ్లిన ఆరోగ్య కార్యదర్శి**

**జ్వరమంటూ ఓపీ చీటీ తీసుకుని క్యూలో నిల్చున్న సౌరభ్ గౌర్**

**గంట తర్వాత విషయం తెలిసి విస్తుపోయిన వైద్య సిబ్బంది**

**వైద్యుల పనితీరు, రోగులతో ప్రవర్తనపై తీవ్ర అసంతృప్తి**




గుంటూరు

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి సౌరభ్ గౌర్ గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో శనివారం జరిపిన ఆకస్మిక తనిఖీ తీవ్ర కలకలం రేపింది. ఎవరికీ ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఆయన ఒక సాధారణ రోగిలా ఆసుపత్రికి రావడంతో వైద్య సిబ్బంది విస్తుపోయారు.

శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో సౌరభ్ గౌర్ జీజీహెచ్ ఓపీ విభాగానికి చేరుకున్నారు. తనకు జ్వరంగా ఉందని చెప్పి ఓపీ చీటీ తీసుకున్నారు. అనంతరం వైద్యుడిని సంప్రదించి, తన ఆరోగ్య పరిస్థితిని వివరించారు. ఆ తర్వాత ఫార్మసీ వద్ద సాధారణ రోగులతో పాటు క్యూలో నిల్చుని మందులు కూడా తీసుకున్నారు. ఈ క్రమంలో దాదాపు గంట పాటు ఆయన ఆసుపత్రిలోని పలు విభాగాలను పరిశీలించారు.

గంట తర్వాత రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల నుంచి జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన అధికారులు, సిబ్బంది హుటాహుటిన సౌరభ్ గౌర్ వద్దకు పరుగులు తీశారు. అప్పటికే ఆయన ఆర్థోపెడిక్ ఓపీ వద్ద ఉన్నారు. సూపరింటెండెంట్ వచ్చి నమస్కరించడంతో అక్కడున్న వారంతా ఆశ్చర్యపోయారు.

అనంతరం సౌరభ్ గౌర్ సూపరింటెండెంట్‌ను వెంటబెట్టుకుని ల్యాబ్, మెడికల్ ఓపీ తదితర విభాగాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓ పీజీ వైద్య విద్యార్థి రోగులతో కటువుగా మాట్లాడటాన్ని గమనించి, అతడిని పిలిచి మాట్లాడినట్లు తెలిసింది. మందుల చీటీలపై సరైన విధానం పాటించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, దీనికోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైద్యుల పనితీరుపై కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రతి వైద్యుడికి సంబంధించి 'కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్' (పనితీరు సూచిక) వివరాలు తీసుకున్నారు.



# హెూరాహెూరీగా సాగిన రాంచీ వన్డే...

## టీమిండియా థ్రిల్లింగ్ విక్టరీ
## దక్షిణాఫ్రికాతో తొలి వన్డేలో భారత్ విజయం
## 17 పరుగుల తేడాతో ఉత్కంఠభరితంగా గెలుపు
## అద్భుత సెంచరీతో కదం తొక్కిన విరాట్ కోహ్లీ

నాలుగు వికెట్లతో సఫారీలను దెబ్బతీసిన కుల్దీప్ యాదవ్ రాంచీ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో టీమిండియా 17 పరుగుల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. 350 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో సఫారీ జట్టు చివరి వరకు పోరాడినా, భారత బౌలర్ల ధాటికి తలవంచింది. ఈ గెలుపుతో మూడు వన్డేల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది. విరాట్ కోహ్లీ అద్భుత శతకంతో పాటు, కుల్దీప్ యాదవ్ కీలక సమయంలో వికెట్లు పడగొట్టి విజయంలో ముఖ్య పాత్ర పోషించారు.

భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికాకు ఆరంభంలోనే గట్టి షాక్ తగిలింది. హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్ ధాటికి 11 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. రియాన్ రికెల్టన్ (0), క్వింటన్ డికాక్ (0) లను హర్షిత్ రాణా పెవిలియన్ చేర్చగా, కెప్టెన్ మార్‌క్రమ్ (7) ను అర్ష్‌దీప్ సింగ్ ఔట్ చేశాడు. ఈ దశలో మాథ్యూ బ్రీట్జ్‌కే (72), టోనీ డి జోర్జి (39) నాలుగో వికెట్‌కు 66 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. దూకుడుగా ఆడుతున్న జోర్జిని కుల్దీప్ యాదవ్ ఔట్ చేసి ఈ భాగస్వామ్యాన్ని విడదీశాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన డెవాల్డ్ బ్రెవిస్ (37) వేగంగా ఆడినా, ఎక్కువ సేపు నిలవలేకపోయాడు.

అయితే, మార్కో జాన్సెన్ (70) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 39 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. బ్రీట్జ్‌కేతో కలిసి ఆరో వికెట్‌కు 97 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్‌ను భారత్ నుంచి లాగేసుకునేలా కనిపించాడు. అయితే, ఒకే ఓవర్‌లో జాన్సెన్, బ్రీట్జ్‌కేలను ఔట్ చేసిన కుల్దీప్ యాదవ్ మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. చివర్లో కార్బిన్ బాష్ (67) కూడా అద్భుతంగా పోరాడాడు. సుబ్రాయెన్ (17), నండ్రే బర్గర్ (17)తో కలిసి చిన్నపాటి భాగస్వామ్యాలు నెలకొల్పి విజయానికి చేరువగా తెచ్చాడు. అయితే, ప్రమాదకరంగా పరిణమించిన బాష్ ను ప్రసిద్ధ్ కృష్ణ అవుట్ చేయడంతో దక్షిణాఫ్రికా 49.2 ఓవర్లలో 332 పరుగులకు ఆలౌట్ అయింది. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్ 4 వికెట్లు పడగొట్టగా, హర్షిత్ రాణా 3, అర్ష్‌దీప్ సింగ్ 2 వికెట్లు తీశారు.

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్, విరాట్ కోహ్లీ (120 బంతుల్లో 135) అద్భుత శతకంతో కదం తొక్కాడు. రోహిత్ శర్మ (57), కెప్టెన్ కేఎల్ రాహుల్ (60) అర్ధ సెంచరీలతో రాణించారు. చివర్లో రవీంద్ర జడేజా (20 బంతుల్లో 32) మెరుపులు మెరిపించడంతో టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 349 పరుగుల భారీ స్కోరు చేసింది.
ఇక ఇరు జట్ల మధ్య రెండో వన్డే డిసెంబరు 3న రాయ్ పూర్ లో జరగనుంది.

## సచిన్ రికార్డు బద్దలు కొట్టిన కోహ్లీ... గవాస్కర్ స్పందన

**దక్షిణాఫ్రికాతో తొలి వన్డేలో విరాట్ కోహ్లీ అద్భుత సెంచరీ**
**సచిన్ రికార్డు తెరమరుగు**
**టెస్టుల్లో 51 సెంచరీలు చేసిన సచిన్ టెండూల్కర్**
**సింగిల్ ఫార్మాట్ లో ఇప్పటివరకు ఇదే అత్యధిక సెంచరీల రికార్డు**
**తాజాగా వన్డేల్లో 52వ సెంచరీ కొట్టిన కోహ్లీ**
**కోహ్లీనే అత్యుత్తమ ఆటగాడంటూ గవాస్కర్ ప్రశంసలు**


భారత క్రికెట్ స్టార్ విరాట్ కోహ్లీ వన్డే ఫార్మాట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న అత్యధిక సెంచరీల రికార్డును అధిగమించి, ఓ ఫార్మాట్‌లో అత్యధిక శతకాలు బాదిన ఆటగాడిగా నిలిచాడు. ఆదివారం రాంచీలో దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో అద్భుత శతకం బాదిన కోహ్లీ.. వన్డేల్లో తన 52వ సెంచరీని నమోదు చేశాడు.

సచిన్ ఇప్పటివరకు ఓ ఫార్మాట్ లో అత్యధిక సెంచరీలు కొట్టిన ఆటగాడిగా ఉన్నాడు. సచిన్ టెస్టుల్లో 51 సెంచరీలు కొట్టాడు. తాజాగా, ఆ రికార్డును కోహ్లీ అధిగమించాడు. కోహ్లీ వన్డేల్లో 52వ సెంచరీ సాధించడంతో, ఓ సింగిల్ ఫార్మాట్ లో అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాడిగా అవతరించాడు.

ఈ చారిత్రక ఘనతపై భారత మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ ప్రశంసల వర్షం కురిపించాడు. ఈ మ్యాచ్ సందర్భంగా జియోస్టార్‌తో మాట్లాడిన గవాస్కర్.. వన్డేల్లో కోహ్లీనే అత్యుత్తమ ఆటగాడని కొనియాడాడు. “విరాట్ కోహ్లీతో కలిసి ఆడిన వారు, అతనికి వ్యతిరేకంగా ఆడిన వారు.. అందరూ అతడే వన్డేల్లో గ్రేటెస్ట్ అని అంగీకరిస్తారు. రికీ పాంటింగ్ కూడా కోహ్లీని అత్యుత్తమ ఆటగాడిగా అభివర్ణించాడు. ఆస్ట్రేలియన్ల నుంచి ప్రశంసలు పొందడం చాలా కష్టం. సచిన్‌ను దాటేశాడంటే, అతని స్థానం ఏంటో అర్థం చేసుకోవచ్చు” అని గవాస్కర్ వ్యాఖ్యానించాడు.
ఈ మ్యాచ్‌లో కోహ్లీ 120 బంతుల్లో 135 పరుగులు చేసి భారీ ఇన్నింగ్స్ ఆడాడు. అతనికి తోడుగా రోహిత్ శర్మ, కెప్టెన్ కేఎల్ రాహుల్ అర్ధ సెంచరీలతో రాణించడంతో, భారత జట్టు దక్షిణాఫ్రికా ముందు 350 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.

ఇటీవల కాలంలో కోహ్లీ ఫామ్‌పై కొన్ని విమర్శలు వచ్చినప్పటికీ, గత నెల ఆస్ట్రేలియా పర్యటనలో రాణించి, ఇప్పుడు స్వదేశంలోనూ అదే జోరును కొనసాగించాడు. ఇప్పటికే టెస్టులు, టీ20ల నుంచి తప్పుకున్న కోహ్లీ, ప్రస్తుతం వన్డే ఫార్మాట్‌పైనే దృష్టి సారించాడు. 2027 ప్రపంచకప్‌ను లక్ష్యంగా పెట్టుకుని కెరీర్‌ను ముగించాలని భావిస్తున్నాడు.





# నెత్తుటి చేతులతో ఆట

మలయాళ అగ్ర కథానాయకుడు దుల్కర్ సల్మాన్ నటిస్తూ.. జోమ్ వర్గీస్‌తో కలిసి నిర్మిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ M GAME నహాస్ హిదాయత్ దర్శకుడు. రీసెంట్‌గా ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. నైట్ క్లబ్, క్యాసినో నేపథ్యంలో సూట్ ధరించి, ట్కాస్టైల్‌గా కూర్చున్న దుల్కర్ సల్మాన్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు.

%రక్తంతో తడిసిన చేతితో గన్ పట్టుకొని ఇంటెన్స్ లుక్‌లో ఇందులో దుల్కర్ కనిపిస్తున్నారు.



# శర్వాతో రొమాన్స్!

## ఆ చాన్స్ కొట్టేసిన అనంతిక

దర్శకుడు శ్రీను వైట్ల , హీరో శర్వానంద్ కలయికలో మూవీ రాబోతోంది. శర్వానంద్ ఇప్పటికే తన లుక్ కోసం కసరత్తులు ప్రారంభించారు. తాజా సమాచారం ప్రకారం ఈ మూవీ కోసం 'మ్యాడ్', '8 వసంతాలు' ఫేమ్ అనంతిక సనీల్ కుమార్ ను హీరోయిన్ గా ఫిక్స్ అయిందట. '8 వసంతాలు' తో కుర్రకారు హృదయాలను ఇప్పటికే గెలుచుకున్న అనంతిక, శర్వానంద్ సరసన స్క్రీన్ కెమిస్ట్రీ ఎలా వుంటుందో అని అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. అదనంగా, మరో సీనియర్ నటుడు కూడా ప్రధాన పాత్రలో కనిపించనుండగా, మైత్రీ మూవీ మేకర్స్ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను భారీ స్థాయిలో నిర్మించనున్నారు.

# ఆయన ప్రేరణతోనే ఫైట్లు కూడా చేశా..



'


ఈ సినిమాలో నా పాత్ర పేరు జనని. చాలామంచి అమ్మాయి. కేరింగ్ కూడా. తనకు 'అఖండ' బ్లెస్సింగ్స్ ఉంటాయి. తన లైఫ్ ఎప్పుడు డేంజర్‌లో పడినా తన కోసం అఖండ వస్తారు. 'భజరంగి భాయ్‌జాన్' తర్వాత చాలా అవకాశాలొచ్చాయి. అయితే.. నేను మంచి పాత్రకోసం ఇన్నాళ్లు ఆగాను. అలాంటి సమయంలో 'అఖండ 2' ఆఫర్ తలుపు తట్టింది. బాలకృష్ణ లాంటి లెజెండ్‌తో కలిసి పనిచేయడం గొప్ప అనుభవం. ఇలాంటి అవకాశం కోసమే ఇన్నాళ్లూ ఎదురు చూశాను.' అని హర్షాలి హల్హోత్రా అన్నారు. బాలకృష్ణ 'అఖండ : తాండవం' చిత్రంలో ఆమె కీలక పాత్ర పోషించారు. బోయపాటి శ్రీను దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 5న విడుదల కానుంది.

%ఈ సందర్భంగా ఆదివారం హర్షాలి విలేకరులతో మాట్లాడింది. 'బాలకృష్ణతో యాక్టింగ్ అనగానే కాస్త భయమేసింది. కానీ ఆయనే ఆ భయాన్ని పోగొట్టారు. నన్ను ఓ ఫ్యామిలీ మెంబర్‌లా చాలా కేరింగ్‌గా చూసుకున్నారు. బాలయ్యసార్ వెరీ ఎనర్జిటిక్. మైనస్ డిగ్రీల చలిని కూడా ఆయన లెక్క చేయలేదు. ఆయన ప్రేరణతోనే ఇందులో నేను కూడా ఫైట్లు చేశాను.' అని గుర్తు చేసుకున్నది హర్షాలి మల్హోత్రా. బోయపాటి శ్రీను ప్రోత్సాహం వల్లే ఈ సినిమాలో ఇంతబాగా చేయగలిగాననీ, ఆయన ప్రోత్సాహం తనలో మరింత ఎనర్జీనీ నింపిందని, జనని పాత్రకు బోయపాటి తననెంచుకోవడం తన అదృష్టమని హర్షాలి ఆనందం వెలిబుచ్చింది.

# బంధుమిత్రుల అభినందనలతో..

దర్శకుడిగా మారిన రచయిత కావడంతో త్రివిక్రమ్ సినిమాల్లో అక్షరాలు లక్షణంగా వినిపిస్తుంటాయి. పానిండియా యుగంలో కూడా తెలుగుదనం గుభాళించేలా సినిమాలకు పేర్లు పెట్టడం త్రివిక్రమ్ శైలి. ప్రస్తుతం ఆయన వెంకటేశ్‌తో సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాకు 'బంధుమిత్రుల అభినందనలతో..' అనే ఓ అందమైన అచ్చతెలుగు పేరును ఖరారు చేశారట త్రివిక్రమ్. ప్రస్తుతం సినిమా వర్గాల్లో ఈ పేరు బాగా వినిపిస్తున్నది.

పెళ్లి పత్రికలపై తరచూ కనిపించే ఈ అక్షరాలు.. ఈ సినిమా ఎలాంటి జానర్‌లో రూపొందుతున్నదో చెప్పకనే చెబుతున్నాయి. రక్తపాతాలు లేని, బాంబులు, తుపాకుల శబ్దాలు వినిపించని క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉంటుందని, ఈ సినిమాతో వెంకటేశ్, త్రివిక్రమ్ చేసే మ్యాజిక్ మళ్లీ కొన్నేళ్లపాటు గుర్తుండిపోతుందని చిత్రవర్గాలు చెబుతున్నాయి. శ్రీనిధిశెట్టి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు.




printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; Mahesh Babu
RNI No: APTEL/2012/46499Phone No 9849499960,9059696959 Email id: Pallevelugu@gmail.com